

# స్క్రిప్టు సిద్ధంగా ఉంది

# సినిమా తియ్యండి — జయంతి

**సూచన పట్టిక :**

**సై. హీ = సైడు హీరోయిన్**

**హీ. తండ్రి = హీరోయిను తండ్రి; సై. హీరో = సైడు హీరో**

**ద ర. స = దర్శకునికి రచయిత్రి సలహా**

**ని. ర. స. = నిర్మాతకు రచయిత్రి సలహా**

మొదటి సీను: వోడంత కారు. ఇంపోర్టెడుది. చయ్యి మంటూ దూసుకు వస్తూంది. దాని మీద టైటిల్సు. కాసేపుముందుఅద్దంమీద, కాసేపుబానెట్ మీద, కాసేపు సీట్ల మీద, కాసేపు డిక్కీ మీద డైరెక్టరు పేరు హీరో మొహం మీద వెయ్యటంలో టైటిల్సు అయిపోయాయి.

ఆ కారులో హీరో లేటెస్ట్ మోడల్ సూట్, కళ్ళ జోడు, చేతిలో సిగరెట్ స్టైయిలుగావచ్చి బ్రహ్మాండమైన బంగళాముందు ఆగాడు. లోపలకు వచ్చాడు. బ్రహ్మాండమైన సెట్టింగు. డజను మంది నౌకర్లు చేతులు కట్టుకుని నుంచున్నారు. "ఏం రామయ్యా? ఏం సుబ్బయ్యా? బాగున్నారా! నేను విదేశాలకు వెళ్ళిన ఈ రెండు సంవత్సరాలూ బాగున్నారా? ఇప్పుడు బాగున్నారా?" అంటూ అందరినీ పలకరించి చివరగా ముసలి విధవరాలైన పని మనిషి దగ్గరకు వచ్చి—

"ఏం శాంతమ్మ! బాగున్నావా?" అన్నాడు.

"నాకేం బాబూ! బాగానే ఉన్నాను. అయినా నీలాటి యజమాని ఉండగా నాకు ఏం కొరత" అంది శాంతమ్మ.

"ఆగు, శాంతమ్మా! అలాఅనకు. నాగుండె బద్దలయి పోతూంది. నేను నీకు యజమానినా? అయ్యో ఏలాటి మాట విన్నాను? చిన్నప్పుడే తల్లి దండ్రులకు దూరం అయిన నన్ను తల్లిలా పెంచిన నువ్వు ఈ మాట అన్నావా? ఈ మాట వినికూడా నాగుండె ఆగి పోదేం?" అంటూ ఆక్రోశించాడు హీరో.

"ఆగు, నాయనా, ఏడవకు. నువ్వు ఏడిస్తే నేను చూడలేను. మీనాన్నకూడాఇంతే. శాంతమ్మా! బాబుని బాగా చూసుకో అని ఏడిచేవాడు. భరించలేక పోయే దాన్ని. ఇప్పుడు నువ్వు ఏడిస్తే నాకూ బాధగా ఉంది, నాయనా!" అంది శాంతమ్మా ఏడుస్తూ.

వీళ్ళిద్దరినీ చూసి పనివాళ్ళు అందరూ కంట తడి పెట్టుకుంటారు. వెంటనే ఇంకో పనివాడు కమేడియన్ వచ్చి—చిన్న బాబు వస్తే అలా ఏడుస్తారా అని కసిరి, నాలుగు జోకులు వేసి అందరినీ నవ్వించి వెళ్ళిపోతాడు.

ఇక హీరో చుట్టూ బోలెడు స్నేహితులు. క్లబ్‌లో పైన హాఫ్ మీటరూ, కింద అర మీటరూ గుడ్డ కట్టుకున్న అమ్మాయితో డాన్సు. తాగుడు పార్టీలు: హడావిడి, ఆర్భాటం అల్లరీ ఆగం, డాన్సులూ, పాటలూ, జోకులూ, కూతలూ, ఆడ పిల్లలని ఏడిపించటం జోరు జోరుగా ఒకరెండు రీళ్ళు కళ్ళు మూసుకుని లాగెయ్యాలి.

అలాగే ఒకరోజు ఓ అమ్మాయిని మోకాళ్ళు దాటిన జడ గుండాన్ని నేలకు తాకిన పమిట గుండాన్ని చేతుల్లో పట్టుకున్న పుస్తకాలు గుండెకు ఆనించుకుని నడుస్తున్న సై. హీ.ని ఏడిపిస్తాడు హీరో. చెంప చెళ్ళు మనిపించి నాలుగుడైలాగులు కొట్టి వెళ్ళి వెళ్ళి పోయింది సై. హీ.

కసిగా ఆ అమ్మాయి వెళ్ళిన వైపు చూసి "చూస్తాను. నన్ను చెంప దెబ్బ కొడతావా? నీ అంతు తేలుస్తాను. నిన్ను సర్వనాశనం చేస్తాను" అని వికటంగా నవ్వాడు హీరో.

చుట్టూ ఉన్న స్నేహితులు వంత పాడతారు. "నిజమే, గురూ! అలాగే చెయ్యి. లేక పోతే నీలాటి వాడిని చెంప చెళ్ళుమనిపిస్తుందా?" అంటారు.

సై. హీ. ఇల్లు. ముందు డ్రాయింగు రూం. సోఫాసెట్, ఒక గోడ గోడియారం. ఒక చిన్న కార్పెట్. ఒక అందమైన షో కేసు. ఒక టి.వి.

లోపలికి రాగానే చేతులోని పుస్తకాలు విసిరేసి—"అబ్బా ఛీ వెధవలు. బుద్ధిలేదు. రాముడు పుట్టిన దేశంలో ఎలా పుట్టారో వీళ్ళు" అనుకుంటూ ఉండగానే తడుముకుంటూ గుడ్డి ముసలమ్మ ప్రవేశం. "వచ్చావా, తల్లీ! డబ్బులు తెచ్చావా? ఇంట్లో బియ్యం లేవు. పొయ్యిలో పిల్లి లేవలేదు" అంది.

"అమ్మా! ఏంచెప్పనమ్మా డబ్బు తేలేదు. నాలుగు నెలలుగా మిషను కుట్టి, ట్యూషన్లు చెప్పి సంపాదిస్తున్నా చాలటంలేదు. బియ్యం ఎలా తెస్తాను, అమ్మా?" అంటూ భోరున ఏడిచింది. సై. హీ.

"పోనీలే, తల్లీ! నీ మనసే నాకు అన్నం. ప్రేమే నీకు ఆహారం. నాకు నువ్వూ, నీకు నేనూ, మనిద్దరికీ ఆ దేవుడు. బాధపడక, అమ్మా" అని కూతురిని కావలించుకుంది తల్లి.

"నాకు తెలుసమ్మా నీ మనసు. నీలాటిదాని కడుపున పుట్టడం నా అదృష్టం. నువ్వే నా దైవం. అందుకే నీకోసం ఈ చీర తెచ్చాను" అంటూ పాకెట్టు అందించింది సై. హీ.

"అయ్యో వెర్రితల్లీ! నాకెందుకే అమ్మా! నా కోసం చీర తెచ్చిన నీకు అన్నం కూడా పెట్టలేక పోతున్నాను. నీళ్ళుతాగి పడుకోమ్మ" అంది గుడ్డితల్లి వలవలఏడుస్తూ, కూతురినికావలించుకుని. "అయ్యో! అమ్మా! ఏడవకు. నీకన్నీళ్ళుచూస్తుంటే నాకు నీళ్ళు తాగాలనిపించటం లేదు" అని తనూ ఏడిచింది సై. హీ.

తరవాత సీన్. రాత్రి చీకటి. పమిట చెదిరిపోయి పడుకుని నిద్రపోతూంది సై. హీ. మెల్లిగా వచ్చాడు హీరో. అతని వెనకాలే స్నేహితులు అద్దాల కిటికీ లోంచి లోపలికి వచ్చారు. సై. హీ. నోరుమూసి బయటికి లాక్కు వెళ్ళి కారులో ఎక్కించి వూరు చివర పాడుబడ్డ బంగళాకి తీసుకు పోయారు హీరో బృందం. లోపలికి వెళ్ళగానే సై. హీ నోరు ఫ్రీగా వదిలేశాడు. హీరో. "అహ్హాహం నా సంగతి ఇప్పటికైనా తెలిసిందా? ఇక నీ అందాన్ని దోచుకుంటాను. నిన్ను నాశనం చేస్తాను. నా పగ తీర్చు కుంటాను" అంటూ వెనక బ్రా కనిపించేలాగా జాకెట్టు చించి, నవరం వూడకుండా జట్టు పీకి, స్టైయిలుగా జుట్టు చెరిపి హీరో రేప్ ప్రయత్నం ఒక రీలు.

సై. హీ. హఠాత్తుగా "ఆగు" అని అరిచింది. ఆగి పోయాడు హీరో. "నువ్వు రాముడు పుట్టిన దేశంలోనే పుట్టావా? గౌతమ బుద్ధుడు, అశోకుడు, మహావీరుడు— వీళ్ళ గురించి ఎప్పుడైనా విన్నావా!" అంది సై. హీ. కోపంగా.

"లేదు. క్రిష్ణుడు, గిరీశం—వీళ్ళ గురించి మాత్రమే చదువు కున్నాను" అన్నాడు హీరో.

"అయితే మాత్రం ఏం? క్రిష్ణుడు సుభద్రని బలాత్కారం చేశాడా? నీకు బుద్ధి లేదూ? నువ్వూ మనిషివి కావూ—నన్ను ఇంట్లోంచి బలాత్కారంగా తీసుకు వచ్చి జాకెట్టు చించి రేప్ చెయ్యటానికి ప్రయత్నిస్తావా? నన్ను నాశనం చేస్తే నేను చచ్చి పోతాను. నన్ను నమ్ముకున్న నా గుడ్డి తల్లి చచ్చి పోతుంది. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది. నువ్వు నాశనం అయిపోతావు. నీ చెల్లెల్నీ ఇలాగే ఎవరో రేపు రేపు చేస్తారు" అంది రొప్పుతూ సై. హీ.

ఆగి పోయాడు హీరో. "నాకు చెల్లెలు లేదు" అన్నాడు ధీమాగా.

"అలా చెప్పు. చెల్లెళ్ళు ఉన్న వాడివైతే ఇలా ఎప్పుడూ ప్రవర్తించవు. నీకు చెల్లెలు లేదేమో


అదృష్టవంతురాలు. . ఉంటే పశువు లాంటి నువ్వు నీ చెల్లెల్ని కూడా రేపు చేసే వాడివి" అంది స్పై.హీ.

"అవు. నేను వినలేను" అంటూ చెవులు గట్టిగా మూసుకున్నాడు హీరో.

బైట హోరుగాలి. తుపాను. హీరో మొహాన చెమటలు. ఎర్రలైటు. భీభత్సమైన సంగీతం. రెండు నిముషాలు గడిచి పోయింది.

గభాల్ని స్పై.హీ. వంక నడిచాడు హీరో. "అమ్మా! నన్ను క్షమించమ్మా. నాకళ్ళు తెరుచు కున్నాయి. నా మనసు కరిగి పోయింది. నా బుద్ధి మారి పోయింది. ఇక నువ్వు నా చెల్లెలివి. నేను నీకు అన్నయ్యను. నువ్వు నాకు దేవతవి. నేను నీకు దైవాన్ని. నువ్వు నా ప్రాణానివి. ఇక ఎవరినీ ఇలా అల్లరి చెయ్యను. అంతే కాదు. ఇక ఎవరైనా ఇలా రేపులు చేస్తే వాళ్ళ ప్రాణం తీస్తాను. నన్ను నమ్మం, తల్లీ!" అన్నాడు.

బయట తుపాను తగ్గిపోయింది. తెల్లటి కాంతి.




కమ్మని సంగీతం.

"నిజమా, అన్నయ్యా?" అంది స్పై. హీ.

సంతోషంగా— "నిజమే నమ్మా! నీ మీద ఒట్టు" అంటూ స్పై. హీ. తల మీద చెయ్యి వేశాడు.

"అన్నయ్యా!" అంటూ అతని మెడ చుట్టూ చేతులు వేసి కావిలించుకుంది స్పై. హీ.

"చెల్లాయ్!" అంటూ ఆమె నడుం చుట్టూ చేతులు వేసి ఉడుం పట్టు పట్టేశాడు హీరో.

ఈ కౌగిలింత రెండు నిముషాలు సాగిపోతుంది. (ద. ర.స— మధ్యలో అన్నయ్యా, చెల్లీ అనిపించటం మాత్రం మర్చిపోకూడదు. లేక పోతే ప్రేక్షకులు ప్రేమ సన్నివేశం అని పొరబడే అవకాశం ఉంది.)

హీరో తన వి తీరా స్పై. హీ. ఒళ్ళంతా తడిమేసి బయట నున్న స్నేహితులను పిలుస్తారు.

"ఏం, బ్రదర్! అయిపోయిందా" అంటూ లోపలికి వస్తారు..

"ఛీ ఛీ దుర్మార్గుల్లారా! ఎటువంటి మాటలు మాట్లాడు తున్నారు? ఆమె నా చెల్లెలు. రాముడు జన్మించిన ఈ దేశంలో, గాంధీ, గౌతముడు పుట్టిన ఈ పవిత్ర భూమిలో ప్రతి ఆడ పిల్లా చెల్లెలాంటిది. స్త్రీ గౌరవమే జాతి గౌరవం. స్త్రీని గౌరవిస్తే—ధర్మాన్ని, సంఘాన్ని గౌరవించి నట్టే. స్త్రీ దైవమూర్తి. ప్రేమ స్వరూపిణి. త్యాగమూర్తి" అంటాడు హీరో ఆవేశంగా.

స్పై. హీ కళ్ళల్లో నీళ్ళు.

అది చూసి ఆదుర్దాగా మళ్ళీ కావిలించుకుని, "అమ్మా! నువ్వు ఏడుస్తున్నావా? ఈ అన్నయ్య ఉండగా నువ్వు ఏడుస్తున్నావా?" అంటాడు.

కళ్ళు తుడుస్తూ, "లేదు, అన్నయ్యా! నీలాటి దైవ స్వరూపుడిని అన్నయ్యగా పొందినందుకు ఇవి ఆనంద బాష్పాలు" అంటుంది స్పై. హీ.

ఇప్పుడు హీరో కళ్ళల్లో ఆనంద భాష్పాలు.

వెంటనే అన్నయ్యని కావిలించుకుని పైటకొంగుతో కళ్ళు తుడుస్తుంది స్పై. హీ.

చెల్లెలి భుజం మీద తల వాల్చుకుని ఏడిచాడు హీరో. వీళ్ళిద్దరినీ చూసి స్నేహితులు అందరూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. ఎవరి కళ్ళు వాళ్ళే తుడుచు కున్నారు.

"కరెక్ట్—బాగా చెప్పావు, బ్రదర్! నీకే కాదు. ఇక నుండీ నీకే కాదు మా అందరికీ చెల్లెలే"అంటారు.

(ద. ర.స. — స్పై. హీ. వేషం వేసే ఆవిడ ఒప్పుకుంటే వీళ్ళు అందరూ కూడా ఒక్కోసారి చెల్లెల్ని కావిలించుకుంటే బాగుంటుంది. కాస్త కొత్తగా ఉంటుంది.)

చెల్లెల్ని భుజం చుట్టూ చెయ్యి వేసి తీసుకు వెళ్ళి కారులో కూర్చో బెట్టాడు. తనూ ఎక్కి స్టార్ట్ చేసి నవ్వుకుంటూ, కబుర్లు చెప్తూ స్పై.హీ. ఇంటికి తీసుకు వెళ్ళాడు హీరో.

"అమ్మా, అమ్మా" అంటూ లోపలికి పరిగెట్టింది స్పై. హీ.

"ఏమిటమ్మా" అంది గుడ్డితల్లి.

"అమ్మా! నాకు ఒక అన్నయ్య దొరికాడమ్మా. రాత్రి నన్ను రేపు చెయ్యటానికి తీసుకు పోయాడు కానీ, నేను కోప్పడితే మారి పోయాడు. ఎంతో మంచి వాడు, అమ్మా, అన్నయ్య. నీకు కళ్ళు ఉంటే ఎంతో సంతోషించేదానివి అన్నయ్యని చూసి" అంది స్పై. హీ. సంతోషంగా,

"చాలా సంతోషం, తల్లీ! నీకు ఇలాటి అన్నయ్య దొరకాలనే నేను రోజూ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఇన్నాళ్టికి నా కోరిక తీరింది" అంది గుడ్డి తల్లి.

మెల్లిగా తల్లిని నడిపించుకుంటూ ముందుగదిలోకి వచ్చింది స్పై. హీ ఆవిడని చూసి అలాగే నిలబడి పోయాడు హీరో. దగ్గరికి వచ్చి అమ్మా అన్నాడు.

"నాయనా" అంటూ కావిలించు కుంది.

"అమ్మా! నేను ఎంత అదృష్ట వంతుడిని—నీ నుంచి నాకు తల్లిలేని లోటు తీరి పోయింది"అన్నాడు.

"ఆగు, నాయనా! ఎప్పు డనగా తిన్నావో రా" అంటూ కూతురి సాయంతో డైనింగ్ టేబుల్ ముందు కూర్చో బెట్టింది. దోశ, ఇడ్లీ, వడ, పూరీ, ఉప్మా, రవ్వదోశ, పెసరట్టు, గులాబుజాములు— అన్నీ బల్లమీద సర్ది కొసిరి కొసిరి తినిపించింది. ఆనందంగా తిన్నాడు హీరో.

"అమ్మా! నేను అక్కడ వంటరిగా అష్ట ఐశ్వర్యాలు అనుభవించటం, మీరు ఇక్కడ ఇలా అనాధలలాగా పేదరికం అనుభవించటమూనా? మీరూ నాతో రండి" అన్నాడు హీరో.

"అలాగే, నాయనా, అంతకన్నానా" అని సంతోషంగా ఒప్పుకుంది తల్లి. ముగ్గురూ కారులో ఎక్కారు. హీరో ఇంటికి చేరారు. రెండు చేతులతో తల్లినీ, కూతురినీ పట్టుకుని ఇంట్లో అడుగు పెట్టాడు హీరో.


"శాంతమ్మా" అని పిల్చాడు. పరుగున వచ్చింది శాంతమ్మ.

"ఇదుగో మా అమ్మ, మా చెల్లెలు" అన్నాడు వాళ్ళని చూపించి. పరమానందపడింది శాంతమ్మ. "రండమ్మా రండి" అని తీసుకువెళ్ళింది. మళ్ళీ చెల్లెల్ని కావిలించుకున్నాడు హీరో.

"అమ్మా, నువ్వు హాయిగా ఉండు. ఇక ఇల్లు దాటి బైటికి వెళ్ళకు. ఈ ఇంటికి నువ్వే రాణివి. నీకు చక్కటి భర్తను చూసి పెళ్ళి చేస్తాను" అన్నాడు ప్రేమగా.

"ఫో అన్నయ్యా" అంటూ హీరో గుండెలో తలదాచుకుంది స్పై. హీ. మరింత గాఢంగా కావిలించు కున్నాడు హీరో.

( ద. ర. స. ) ఇక స్పై. హీ. కి ఖరీదైన చీరలు కట్టాలి. అద్దాల జాకెట్లు వెయ్యాలి. హీరో డ్రెస్ మార్చాలి. ఇప్పటిదాకా రెండు కాళ్ళు రెండురంగులూ రెండు చేతులూ రెండు రంగులూ ఉన్న డ్రసులు వేసి, ఇక నుండీ ఒకే రంగు బట్టలు వేసెయ్యాలి. ఇప్పటిదాకా పిచ్చిక గూడులాగా ఉన్న హెయిర్ స్టైలు మార్చి ఇంత వంటావదం రాసి నున్నగా




తల దువ్వాలి. అతని స్నేహితులు పది మందికీ ఖాడా డ్రెస్‌లు మార్చాలి. అంటే వాళ్ళంతా బుద్ధిమంతులు అయిపోయారన్నమాట.

మరో రెండు రీళ్ళు హీరో తన ఫాక్టరీలో, తిరుగుతూ అందరికీ పనులు పురమాయిస్తాడు. బ్రహ్మాండంగా ఉన్న గదిలో రివాల్వింగ్ చెయిర్. స్టైల్‌గా కూర్చుని ఫోన్లు చేస్తాడు. పొద్దున్నే లేచి తెల్ల పైజమా, షర్టు వేసుకుని తల్లి, చెల్లి పక్కన కూర్చుని పూజ చేస్తాడు. వోపిక ఉంటే ఇక్కడ ఒక పాట ... "దశరథ రామా, జానకి రామా, లక్ష్మణ రామా, హనుమంతరామా, తాటకి రామా శూర్పణక రామా, కారుణ్య రామా కరుణించురామా" ఇది పల్లవి. చరణాలు ఏవైనా రాసుకోవచ్చు. రాత్రి పూట హీరో ఫైళ్ళు ముందువేసుకుని కూర్చుంటాడు. పాల గ్లాసుతో వస్తుంది. పై. హి. బుగ్గన చిటిక వేసి అందుకుంటాడు హీరో.

తరవాత సీను. చల్లని సాయంత్రం హీరో కారులో రంయిన వస్తున్నాడు. హుషారుగా సిగరెట్ తాగుతూ ఒంటిచేత్తో డ్రైవ్ చేస్తూ వస్తున్నాడు. ఇంతలో దూరం నుండి "రక్షించండి. హెల్ప్" అంటూ అరుపులు వినిపిస్తాయి. వెంటనే కారు ఆపేసి పరుగున అటు వెళ్తాడు హీరో. పెద్ద గోడవును. అందులో బోలెడు రేకు పెట్టెలు, అట్ట పెట్టెలు, డబ్బాలు, డొక్కులు ఉన్నాయి. ఎవరూ లేరు. జాగర్తగా వెతుకుతున్నాడు హీరో. అంతలోనే మళ్ళీ కేక. "దుర్మార్గుడా వదులు" అంటూ. అటు పరిగెత్తాడు. అక్కడ ఒక యువతి హీరోయిన్, ఆవిడ మీద విలన్. వాళ్ళిద్దరి మీదికి హీరో దూకాడు. ఫైటింగ్. డిష్యూం డిష్యూం. పది నిముషాల ఫైటింగ్ అనంతరం విలన్ పారిపోయాడు రక్తసిక్తమైన ముఖం, చింకిపీలికలైన బట్టలతో. హీరోమాత్రం బంగారు తండ్రిలాగా ఉన్నాడు.

సుతారంగా క్రాపు సర్దుకుని హీరోయిన్ వైపు నడిచాడు. "పారిపోయాడు పిరికి పంద" అన్నాడు.

"మీ ఋణం తీర్చుకోలేను" అంది హీరోయిన్ అతన్నే చూస్తూ. "పరవాలేదు. అయినా రోజులు తగలబడిపోతున్నాయి. మనుషులలో రాక్షసత్వం ప్రబలిపోతోంది. రాను రాను ఆడదానికి రక్షణ తగ్గిపోతోంది. మన జాతి పిత గాంధి గారు ఏమన్నారు. స్త్రీని పవిత్రంగా చూడమన్నారు. స్త్రీ గౌరవం దేశ గౌరవం. జాతి గౌరవం. కానీ అది మర్చిపోయి ఈ నాడు అందరూ రేపులు చేసేస్తున్నారు. మన జాతికే మాయని మచ్చ తెస్తున్నారు. ఇది ఇంకా ప్రబలిపోతే దేశం అంతా అవినీతిపాలై పోతుంది. అందరూ రేపులు చేస్తారు. అసలు అందరూ రేపులే చేస్తారు. ఆ నాడు ఈ దేశ ప్రగతి, ఈ దేశసౌభాగ్యం ఏమైపోతాయి. నాశనం అయిపోతాయి. నా మనసు బాధపడుతోంది తల్చుకుంటేనే. మన జాతి పిత ఆత్మ ఘోషిస్తుంది" అంటూ ఆ పక్కనే ఉన్న ఆయిల్ డమ్ముకి తల బాదుకుని విలపిస్తాడు హీరో.

ని. ర. స: కాస్త రేటు ఎక్కువ అయినా సుబ్బరమైన హీరోని పెట్టుకుంటే బరువుగా డైలాగులు చెప్తాడు. ఎక్సరు బాగా పోతుంది.)

హీరోయిన్ కళ్ళల్లో నీళ్ళు. హీరో దగ్గరగా వెళ్ళి అతని భుజం మీద చెయ్యి వేసింది. "చూడండి నన్ను ఇప్పటికి చాలా మంది రేపు చెయ్యటానికి ప్రయత్నించారు. ప్రతీ సారి ఎవరో ఒకరు రక్షిస్తూనే ఉన్నారు. కానీ మీ లాంటి కరుణామయుడిని, ప్రేమమూర్తిని నేను ఇంతవరకు చూడలేదు. మీ లాటి వారు ఒక్కరు ఉన్నా మనదేశం తప్పక బాగుపడుతుంది. నా మాట నమ్మండి" అంది.

వెనక్కి తిరిగి చూశాడు హీరో. "మీరు ఎంత మంచివారు" అన్నాడు.

"నన్ను అలా మీరు అనకండి. నేను మీదాన్ని" అంది సిగ్గుగా హీరోయిన్.

"ఆగు. నీ ప్రేమ నన్ను పిచ్చివాడిని చేస్తోంది కానీ, నేను నీ ప్రేమకు అనర్హుడిని" అన్నాడు హీరో దీనంగా.


"ఏం ఎందుకు చెప్పండి" అంది హీరోయిన్.

"నాది ఒక దీన గాథ. నా చిన్నతనంలో..." అంటూ పైకి చూడటం ప్రారంభించాడు.

ఫ్లాష్ బాక్ బిగిన్. ఒక ఇల్లు. అందులో ఒక మధ్య వయసు ఆయన, ఆయన భార్య, ముగ్గురు పిల్లలు. హీరో చెప్తున్నాడు. మా నాన్నగారు ఎంతో మంచి వారు. మా అమ్మ ఎంతో మంచిది, మా చెల్లెలు, తమ్ముడు అంతకన్నామంచివాళ్ళు. ఆ రోజు మా ఇంట్లో మా చెల్లి పుట్టిన రోజు. అందరం పండగ చేసుకున్నాం. సరదాగా గడిపాం. ఆ సాయంత్రం అందరం బయట కూర్చుని ఉన్నాం. కబుర్లు చెప్పుకుంటున్నాం. మా నాన్నగారి సిగరెట్లు అయిపోయాయి. 'బాబూ! సిగరెట్లు తెచ్చిపెట్టరా'

అన్నారు. అలాగే నాన్నగారూ అంటూ ఆయన పాదాలకి దణ్ణం పెట్టి బయలుదేరాను. మా ఇంటికి అర ఫర్లాంగు దూరంలో ఉన్న కిళ్లీ షాపు వైపు నడక సాగించాను. నా మనసునిండా సంతోషం, సరదా. గబగబ వెళ్ళి సిగిరెట్లు కొన్నాను. వెనక్కు తిరిగాను. నా మనసులో ఏదో దిగులు. ఆరాటం, భయం. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటివైపు నడిచాను. ఇల్లు దగ్గరపడింది. గబగబా పరిగెట్టాను. అక్కడ ఇల్లు లేదు. కూలిపోయింది. అమ్మా, నాన్న గారూ, చెల్లి, తమ్ముడూ ఎవరూ లేరు. భయంవేసి కేకలు వేశాను. దూరంగా ఒక కారు. అందులోనించి ఏడుస్తున్నాడు తమ్ముడు. అటు పరుగెట్టాను. కానీ ఆలస్యం అయిపోయింది. కారు వెళ్ళిపోతోంది. నేను ఆ దుర్మార్గుడి ఎడమ కాలుమాత్రమే చూడ గలిగాను. నీలం పాంటు వేసుకుని ఉన్నాడు'' అన్నాడు హీరో కసిగా.

''ఎవరు వాడు? ఎవరు ఆ దుర్మార్గుడు'' అంది




హీరోయిన్ నిప్పులు కక్కుతూ. హీరో నోరువిప్పాడు. ''వాడు మానాన్నగారికి శత్రువు. వాడి బాస్ కొడుకు పరీక్ష బాగా రాయక తప్పాడు. మా నాన్నగారిని మార్కులు కలిపి పాస్ చేయించమన్నాడు. కానీ సత్యమే పరమావధిగా జీవించే మా నాన్నగారు వల్లకా దన్నారు. డబ్బు ఆశ చూపాడు. వాడి యజమాని కొడుకు ఏడవక్లాసు పాసయ్యేలాగా చూస్తే మా నాన్నగారికి పాతిక లక్షలు ఇస్తానన్నాడు. కానీ తను నమ్ముకున్న ధర్మం ముందు అమృతమూర్తి మా నాన్నగారికి ఆ డబ్బు తృణ ప్రాయంగా కనిపించింది. అందుకే వీల్లేదన్నారు. మంచికి రోజులుకావు. నీతికి బ్రతుకులేదు. నిజానికి విలువలేదు. ధర్మానికి జయం లేదు. అందుకే ఆ దుర్మార్గులు మా నాన్న మీద కత్తిగట్టి పగ పెంచుకున్నారు. నేను లేని సమయం చూసి, నేను సిగరెట్లు పెట్టె తెచ్చేలోపల మా ఇల్లు పడగొట్టి నా వాళ్ళందరినీ తీసుకు పోయారు. నేనే ఉండి ఉంటే వాళ్ళందరినీ చంపేసి ఉండేవాడిని. కానీ ఏమీ చెయ్యలేకపోయాను. అసమ ర్థుడినై పోయాను'' అంటూ దుఃఖించాడు హీరో.

తలనిమిరి ''బాధపడకండి'' అంటూ ఓదార్చింది హీరోయిన్ కన్నీళ్ళతో.

''ఎలా బాధపడకుండాఉండను చెప్పండి? అప్పుడు నాకు ఏడేళ్ళు. ఇప్పుడు ఇరవై ఏడేళ్ళు. ఆ నాడు ఒంటరిగా ఉండిపోయిన నేను ఎంతో కష్టపడ్డాను. ఒక మహాత్ముడు నన్ను చేరదీశాడు. బరువులుమోసి, పేపర్లు పంచి, రిక్షా లాగి డబ్బు కూడబెట్టి ఒక ఫాక్టరీ కొనుక్కున్నాను. ఇప్పుడు నాకు బోలెడు డబ్బు ఉంది. కార్లు, బంగళాలు, నౌకర్లు అందరూ ఉన్నారు. కానీ నాకు శాంతి లేదు. కళ్ళు మూసినా, తెరిచినా నా కళ్ళ ముందు ఆ నీలం పాంటు కాలే కనిపిస్తూ ఉంటుంది. ఏ రోజైనా వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలి. ఆనాడే నా మనసుకు శాంతి'' అన్నాడు నిలువెల్లా వణికిపోతూ హీరో.

హీరోయిన్ అతని దగ్గరగా వచ్చింది. అతని తల లోకి చేతులు పోనిచ్చి గాఢంగా తన గుండెకు హత్తు కుంది. ''ఆవేశపడకండి. మీ ప్రతిజ్ఞ తప్పక నెరవేరు తుంది. మీ వాళ్ళంతా మీకు కనిపిస్తారు. నా మాట వినండి. నేను మీకు తోడు ఉంటాను'' అంటూ అతని తల మీద తన తల వాల్చుకుని పరవశంగా కళ్ళుమూసుకుంది. హీరోయిన్ నడుం చుట్టూ చేతులు వేసి గాఢంగా కావిలించుకున్నాడు హీరో.

నెక్స్ట్ సీన్ : పచ్చిక బయళ్ళు, జలపాతాలు, నెమళ్ళు, కొండలు—వీటన్నింటికీ మధ్య హీరో, హీరోయిన్ డ్యూయట్ పాట —

''నీ కనులలో నేను, నా మనసులో నువ్వు ఈ పచ్చికలో పొర్లుదాం, ఈ సెలయేటిలో మునుగుదాం.''

ద. ర. స. చరణానికి ఒక డ్రెస్ తప్పనిసరిగా మార్చాలి. శక్తి ఉంటే పదానికి ఒక డ్రెస్ మార్చినా బాగానే ఉంటుంది.

సరే డ్యూయట్ అయిపోయింది. ఇద్దరు ఒకరి నడుం మరొకరు పట్టుకుని కారులో ఎక్కారు. కారు రివ్వున దూసుకుపోయింది.

వెళ్ళి హీరోయిన్ ఇంటి ముందు ఆగింది. హీరోయిన్ దిగబోయింది. హీరో చెయ్యి పట్టుకుని లాక్కుని ముద్దు పెట్టుకోబోయాడు. (అవిడకి ఏం అభ్యంతరం లేదు కానీ సెన్సార్‌కి అభ్యంతరం.) అందుకే వారించి మొహం పక్కకి తిప్పేసుకుంది.

''ఛీ పో అల్లరి మనిషివి నువ్వు. ఇవన్నీ మన పెళ్ళి అయ్యాక'' అంటూ కారులోంచి దిగబోయింది.

మళ్ళీ లోపలికి లాక్కున్నాడు హీరో. కాసేపు అయ్యాక దిగబోయింది. మళ్ళీ లోపలికి లాగాడు హీరో.

ఇలా ఇరవై ఆరు సార్లు జరిగాక ఎలాగైతేనేం హీరోయిన్ దిగి టా టా చెప్పింది. కారు కదిలి వెళ్ళి పోయింది.

హీరోయిన్ ఇంట్లోకి నడిచింది. మేడ మీద చీకటిలో నిలబడి ఇదంతా గమనిస్తున్నాడు హీరో యిన్ తండ్రి. నోట్లో పైపు. సీరియస్‌గా ఉన్నాడు.

''హూ'' అని హుంకరించి లోపలికి నడిచాడు. హీరోయిన్ స్టైలుగా నడుస్తూ పాటపాడుకుంటూ లోపలికి వచ్చింది.

పెద్ద హాలు. హాలులోంచే పైకి మెట్లు. కళ్ళు తిరిగి కింద పడిపోయేంత గొప్ప ఫర్నిచర్. ''ఆగు'' అన్నాడు హీరోయిన్ తండ్రి. ఆగిపోయింది హీరో యిన్.

''ఎక్కడికి వెళ్ళావ్?''

''షికారుకి?''

''ఎవ రతను?''

''నా స్నేహితుడు.''

''అబద్ధం. స్నేహితుడయితే అర్ధరాత్రి పూట నిన్ను ముప్పై రెండు సార్లు కార్లోకి లాగడు'' అని గర్జించాడు తండ్రి.

''ముప్పై రెండుసార్లు ఏం లాగలేదు. ఇరవై రెండు సార్లే లాగాడు'' అంది హీరోయిన్ కోపంగా.

''కాదు. ముప్పై రెండుసార్లు.''

''ఏం కాదు—ఇరవై రెండుసార్లే''.

''కాదు—నేను కళ్ళారా చూశాను. ముప్పై రెండు సార్లు.

''అరె—కాదంటుంటే. నన్నే కదా లాగాడు. నాకు తెలియకుండా ఉంటుందా? ఇరవై రెండుసార్లు నాన్నగారూ'' అంది హీరోయిన్ ఖచ్చితంగా.

''సరే, ఎన్నో కొన్నిసార్లు. స్నేహితుడైతే అలా లాగడు'' అన్నాడు తండ్రి రాజీకి వస్తూ.

''కాదు లాగుతాడు'' అంది హీరోయిన్ పెంకిగా.

''ఊహుఁ లాగడు'' అన్నాడు తండ్రి మొండిగా.

''లాగుతాడు.''

''లాగడు.''

''లాగుతాడు.''


''లాగడు.''

''లాగుతాడు.''

''లాగడు. పిచ్చివేషాలు వేస్తున్నావు. చెప్పుః ఎవడు వాడు?'' అని గర్జించాడు తండ్రి.

వలవల ఏడిచింది హీరోయిన్.

( ని. ర. స. కాస్త ఏడుపగల హీరోయిన్‌ని




పెట్టేస్తే నిక్షేపంలా తనూ ఏడుస్తుంది. (ప్రేక్షకులనీ ఏడిపిస్తుంది.)

హీరోయిన్ తండ్రికి ఏడుపు వచ్చింది. కూతురి దగ్గరికి వెళ్ళి తల నిమిరాడు. "చూడు, తల్లీ. మీ అమ్మే కనక బ్రతికి ఉంటే నీ సంగతి తనే చూసుకునేది. తను చచ్చిపోయింది కాబట్టి నేను నిన్ను బాధపెట్టక తప్పటం లేదు" అన్నాడు గద్గద కంఠంతో.

"నాన్నా. మీ బాధ నాకు తెలుసు నాన్నా. మీరు నన్ను ఎంత ప్రాణంగా చూస్తారో నాకు తెలుసు. కానీ అతను చాలా మంచివాడు, నాన్నా" అంది హీరోయిన్ ఏడుస్తూ.

"ఏమో తల్లీ. నువ్వు మామూలు మనిషివైతే ఏం ఫరవాలేదు. కానీ నా డెబ్భై ఆరు లక్షల ఆస్తికి ఏకైక వారసురాలివి. నీ ఆస్తిమీద, నీ అందం మీద కన్నువేసి ఎవరైనా నిన్ను మోసం చేస్తారేమో అని భయం" అన్నాడు తండ్రి గంభీరంగా.

కిలకిల నవ్వింది హీరోయిన్. "నాన్నా! నాకు అంతమాత్రం తెలియదా? ఇతనికి తొంభై నాలుగు లక్షల ఆస్తి ఉంది. వెనకా ముందూ ఎవరూ లేరు." అంది.

హీరోయిన్ తండ్రి మొహం వికసించింది., 'నా తల్లే...నా బంగారు తల్లివి నువ్వు. ఇక కానిచ్చెయ్, అమ్మా. నీ ఇష్టం" అన్నాడు.

"పోండి నాన్నా" అంటూ సిగ్గుగా నవ్వి తన గదిలోకి పరుగెట్టింది హీరోయిన్. స్ప్రింగ్‌కాట్ మీద ఎగిరి దూకింది. అటూ ఇటూ పొర్లింది. మంచం మొగ్గలు వేసింది. చివరికి తిన్నగా పడుకుని పక్కనున్న ఫోన్ అందుకుని డయల్ చేసింది.

హీరో అందుకున్నాడు. "హలో" అన్నాడు.

"ఏయ్ నేనే" అంది హీరోయిన్.

ఇద్దరూ కాసేపు ప్రేమ కబుర్లు చెప్పుకున్నారు. "రేపు సాయంత్రం కొండ దగ్గరకు రా" అంది హీరోయిన్.

"వస్తే ఏం ఇస్తావు?" అన్నాడు హీరో.

"నీకు కావలసింది ఇస్తాను" అంది హీరోయిన్.

మెలికలు తిరిగిపోయి ఫోన్ పెట్టేశాడు హీరో.

తరవాతి సీన్ : హీరో దర్జాగా తయారై కొండదగ్గర వెతుకుతూ ఉంటాడు.

వెనకనుండి "హో హో" అని పాట. మళ్ళీ వెతుక్కుంటాడు హీరో. ఒక చెట్టు చాటునుండి బయటికి వచ్చింది హీరోయిన్.

"వచ్చానురోయ్, నీకోసం వచ్చాను రోయ్, నాన్న సరేనన్నారు రోయ్, మనిద్దరికీ పెళ్ళవుతుందిరోయ్" అంటూ పాట పాడుతుంది.

ఆనందం పట్టలేక పూనకం వచ్చిన వాడిలాగా ఒళ్ళూ, తలా, కాళ్ళూ ఊపేస్తూ డాన్సు చేస్తాడు హీరో.

హీరోయిన్ కూడా పిచ్చిదానిలాగా డాన్సుచేస్తుంది. ఇద్దరూ కావలించేసుకుని, దొర్లి, పొర్లి డాన్సు చేస్తారు. పెద్ద వాన—ఇద్దరూ తడుస్తారు. చలికి వణుకుతూ కారు ఎక్కుతారు.

తరవాతి సీన్: సై. హీ. పూల బుట్టతో గుడికి వస్తుంది. చక్కటి పట్టుచీర. వాలుజడ. ముఖాన అర్ధ రూపాయి కాసంత బొట్టు. దేవుడి దర్శనం చేసుకుని వస్తూ ఎదురుగా వస్తున్న సై. హీరోని డాష్ ఇస్తుంది. పూలబుట్ట కిందపడిపోతుంది. సై. హీరో అవి తీసి ఇస్తాడు.

"సారీ" అంటాడు కన్నార్పకుండా సై. హీ.ని చూస్తూ.

"పరవాలేదు" అంటుంది సిగ్గుగా సై. హీ.

"పదండి నా కారులో దింపుతాను" అంటాడు.

"సరే" అని కారు ఎక్కుతుంది.

"మీరు ఎక్కడ ఉంటారు? మీ నాన్నగారి పేరు ఏమిటి?" అంటాడు. సై. హీరో.

వలవల ఏడుస్తుంది సై. హీ. "మా నాన్నగారు లేరు" అంటుంది.

"అయ్యో! పాపం, ఏడవకు" అంటూ తనూ కన్నీరు కారుస్తాడు.

"ఏడవను. నాకు ఏడవాల్సిన అవసరం లేదు. నాకు ఒక అన్నయ్య ఉన్నాడు. ఎంత మంచివాడో! మా అన్నయ్య నవ్వితే వెన్నెల నవ్వినట్లు ఉంటుంది.

మా అన్నయ్య చూస్తే పాలు పొంగినట్టు ఉంటుంది. మా అన్నయ్య నడిస్తే డాన్సు చేసి నట్లుంటుంది. మా అన్నయ్య మాట్లాడితే పాట పాడినట్లు ఉంటుంది. మా అన్నయ్య కళ్ళు లేడి కళ్ళు. ముక్కు చిలక ముక్కు'' అంది సై. హి. పరవశంగా.

''అలాగా. అయితే అంత మంచి అన్నయ్యని నాకు చూపించవూ'' అన్నాడు సై. హీరో.

''అలాగే'' అంది సై. హి. సిగ్గుపడుతూ.

కారు ఆపి ''ఐ లవ్ యూ'' అన్నాడు సై. హీరో. సిగ్గుపడి చేతులతో మొహం కప్పుకుని పారిపోతుంది సై. హి.

ఇక వీళ్ళద్దరి ప్రేమ...

( ద. ర. స. : బడ్జెట్ ఎలా చేస్తే వీళ్ళిద్దరికీ ఒక డ్యూయట్ పెట్టచ్చు. అవుట్‌డోర్‌లో. లేదూ అనవసరం అనుకుంటే చేతులు నలుపుకోవటంతోనూ కౌగిలింతలతోనూ సరిపెట్టేయచ్చు. చివరలో ఇద్దరినీ ఒక కట్టెల అడితిలోకో, చీకటిగదిలోకో, కొండ గుహ

''నేను—వూ—నేను ...''

''వూ నువ్వు?''

''నేను ఒకతన్ని ప్రేమించాను. అతన్నే పెళ్ళి చేసుకుంటాను'' అంది సై. హి.


దీర్ఘంగా నిట్టూర్చాడు హీరో. కిటికీ దగ్గరకు వెళ్ళి సిగరెట్టు ముట్టించుకున్నాడు.

సై. హి. వెంటనే వెళ్ళి అతని కాళ్ళ మీద పడి ''అన్నయ్యా, నీ మనసు కష్టపెడితే క్షమించు'' అంది.

వెంటనే చెల్లెలిని లేవనెత్తాడు హీరో. కళ్ళు తుడిచాడు.

''పిచ్చితల్లీ! ఎందుకమ్మా ఏడుపు? నీ సంతోషమే నా సంతోషం'' అన్నాడు గాఢంగా కావలించుకుని.

దుఃఖాశ్రువులు కాస్తా ఆనంద బాష్పాలుగా మారిపోయాయి సై. హి.కి.




లోనికో, పెట్ట తొర్ర లోనికో, ఏదీ లేకపోతే కొత్తగా ఉంటుంది కారు కిందకో పంపించటం మాత్రం మర్చిపోకూడదు.

తరవాత సీన్ :హీరో వచ్చి''అమ్మా, తల్లీ, చెల్లీ'' అంటూ పిలుస్తాడు. పరుగున వస్తుంది సై.హి.— ''ఏమిటన్నయ్యా?'' అంటూ.

''నీ పుట్టిన రోజుకి బ్రహ్మాండమైన పార్టీ ఇస్తాను. ఆ రోజే ఈ వూరిలోని యువకులను అందరినీ పిలుస్తాను. అందులో నీకు నచ్చిన వాడిని, నువ్వు మెచ్చిన వాడిని నీకు ఇచ్చి పెళ్ళిచేస్తాను'' అన్నాడు.

తల వంచుకుని కాలి బొటనవేలితో నేలను రాస్తుంది. సై. హి. గాఢంగా చెల్లిని కౌగలించుకొని ''నా తల్లికి ఎంత సిగ్గు వచ్చింది'' అంటాడు హీరో.

''కాదన్నయ్యా. నేను, నేను, నేను. నేను ...''

''ఏమిటమ్మా నువ్వు?''

''మా అన్నయ్య ఎంత మంచివాడు'' అంది.

''అతన్ని నీపుట్టిన రోజుకి పిలు''అన్నాడు హీరో.

తరవాతి సీన్ : బ్రహ్మాండమైన పార్టీ. ఇల్లు అంతా బల్బులు. హాలునిండా జనం. మోకాళ్ళు కనిపించేలాగా గౌన్లు వేసుకున్న అమ్మాయిలు, సూట్లు వేసుకున్న అబ్బాయిలు. హీరో బ్రహ్మాండమైన సూటు వేసుకుని అటూఇటూ తిరిగేస్తున్నాడు. సై. హి. మోకాళ్ళదాకా జరీ అంచు ఉన్న చీ రకట్టుకుని తిరుగుతోంది. హీరోయిన్ తండ్రితో ప్రవేశం. ఫాషన్‌గా కట్టుకున్నచీర. స్లీవ్‌లెస్ జాకెట్టు. హీరో ఎదురు వెళ్ళి ఆహ్వానించాడు. హీరో, హీరోయిన్ కళ్ళతో మాట్లాడుకున్నారు కాసేపు. తరవాత సై. హీరో ప్రవేశం. సై. హి. అన్నయ్య దగ్గరికి పరిగెట్టి అతన్ని చూపించింది. హీరో వచ్చి సై. హీరోని తీసుకు వెళ్ళాడు లోపలికి. సై. హి, సై. హీరో కూడా కాసేపు కళ్ళతో మాట్లాడుకున్నారు. అంతలోకే విలన్ ( అంటే ఆ నాడు హీరోయిన్‌ని రేపు చెయ్యబోయి చావు తన్నులు తిన్నవాడు ) వస్తాడు. అతన్ని ప్రేక్షకులు గుర్తుపట్టేస్తారు. కానీ హీరో గుర్తు పట్టకూడదు. ''హలో'' అని చెయ్యి అందిస్తాడు హీరో. అతను మాత్రం హీరోని, హీరోయిన్‌ని గుర్తుపట్టేస్తాడు. పళ్ళు కొరుక్కుంటాడు కసిగా. హీరోగారి గుడ్డితల్లి కుర్చీలో కూర్చుంది.

కాసేపు అయ్యాక హీరో అందరినీ ఉద్దేశించి, ''నా చెల్లెలు పాట పాడుతుంది'' అని ఎనౌన్సు చేస్తాడు.

వెంటనే సై. హి. చిరునవ్వులు చిందిస్తూ వెళ్ళి అక్కడ ఎత్తుగా పెట్టిన వేదిక మీద కూర్చుని వీణ చేతుల్లోకి తీసుకుంటుంది. టింగు టింగుమని వీణ వాయిద్యం మొదలు. ( ద. ర. స. ఇక్కడ వీలైనంత వరకు క్లోజప్ చూపించకుండా ఉంటే మంచిది.కాదు సై. హి.ని క్లోజప్ తియ్యాల్సిందే అని మీరంటే ఆ సై. హి. వేసే నటికి ముందుగానే గట్టిగా చెప్పాలి. తల్లీ నువ్వు ఎంత బిజీ ఆర్టిస్టువి అయినా వీణ రెండు చేతులతోనూ వాయించి తీరాల్సిందే. అంతేకానీ, కుడిచెయ్యి కదిలించకుండా ఎడంచేత్తో వీణంతా తడిమెయ్యడానికి వీలులేదు. అని హెచ్చరించాలి. )

పాట — అన్నయ్యా, కన్నయ్యా నా మదిలో వెలిసిన చిన్నయ్యా, నీవు లేనిదే బ్రతుకులేదు పిచ్చయ్యా'' అంటూ ఆనంద బాష్పాలతో సై. హి. పాడుతూ ఉంటే నిలువెల్లా పులకించి పోతూ, మాటిమాటికీ కళ్ళుతుడుచుకుంటూ ముక్కు రుమాల్లోకి చీదుకుంటూ ఆనందిస్తాడు హీరో.

హీరోని చూసి హీరోయిను, సై. హి.ని చూసి సై. హీరో కూడా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటారు. పార్టీకి వచ్చిన వాళ్ళందరూ సై. హి. గానకళా కౌశలానికి ముగ్ధులై బుర్రలు వూపుతూంటారు. పాట ముగిసింది. అందరూ కరతాళధ్వనులు చేస్తారు. వెంటనే హీరో సై. హి. ని గాఢంగా కావలించుకుంటాడు. ఆ తరవాత హీరో సై. హీరోని, హీరోయిన్ సై. హి.ని, హి. తండ్రి సై. హి. తండ్రిని కావలించుకుంటారు. గుడ్డి తల్లిని శాంతమ్మ కౌగలించుకుంటుంది. హీరో స్నేహితులు కమేడియన్ని కావిలించుకుంటారు. విలన్ తను కౌగలించుకునేందుకు ఎవరూ లేక పళ్ళు పటపట కొరుకుతాడు. నీ మీద ప్రతీకారం తీర్చుకోకపోతే నా పేరు విలనే కాదు అని ప్రతిజ్ఞచేస్తాడు హీరోని చూసి.

తరవాతి సీన్. హీరో తయారై కిందికి వచ్చాడు. ''చెల్లీ'' అని పిలిచాడు.

''ఏమిటన్నయ్యా'' అంది సై. హి. పరుగున వచ్చి.

''నీ ప్రియుడి దగ్గరకు వెళ్ళి మాట్లాడి వస్తాను'' అన్నాడు చెల్లెలి బుగ్గమీద చిటికవేసి. మెలికలు తిరిగిపోయింది సై. హి.

పడవంత కారులో సై. హీరో ఇంటికి వెళ్ళాడు హీరో. సై. హీరో తండ్రి ఇంటిముందు కూర్చుని ఉన్నాడు. అదో పెద్ద బంగాళా. దానిముందు లాన్. లాన్లో కుర్చీలు. 'రండి' అని ఆహ్వానించాడు సై.హి. తండ్రి. హీరో హుందాగా కూర్చున్నాడు. కూలింగ్

గ్లాసెన్ తీసి బల్లమీద పెట్టాడు. నౌకర్లు కాఫీ అందించారు.

హీరో మొదలుపెట్టాడు. "చూడండి—మా చెల్లెలు మీ అబ్బాయిని ప్రేమించింది. వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసేద్దాం" అన్నాడు.

సై. హీరో తండ్రి నవ్వి—"అసలు మీకు చెల్లెళ్ళులేరు. ఈఅమ్మాయి ఎవరు?" అని అడిగాడు.

హీరో లేచి దీర్ఘంగా నిట్టూర్చాడు. "చూడండి. నాకు చెల్లెలు ఉండేది. కానీ ఇప్పుడు లేదు. ఈ చెల్లెలు నా చెల్లెలు స్థానంలో వచ్చింది. కాబట్టి ఈ అమ్మాయే నా చెల్లెలు" అన్నాడు.

సై. హీరో తండ్రి లేచాడు. "కావచ్చు. కానీ, నేను చాలా ఖచ్చితం మనిషిని. రేపు మీ చెల్లెలు వస్తే ఈ చెల్లెలు సంగతి పట్టించుకోరు. అందుకే నీ చెల్లెలు నా ఇంటి కోడలు కావాలంటే నీ యావ దాస్తీ నీ చెల్లెల పేర రాయాలి" అన్నాడు.

హీరో ముఖం గంభీరంగా అయింది. గంభీరమైన బాక్‌గ్రౌండు మ్యూజిక్. "సరే నేను ఆలోచించుకు చెప్తాను" అన్నాడు, హీరో లేచి నిలబడి.

వాకిట్లో సై. హీరో ఎదురయ్యాడు. "చూడండి — నేను చాలా మంచివాడిని, మీ చెల్లెల్ని ఎంతో ప్రేమిస్తున్నాను. నేను మా నాన్న చేతిలో కీలుబొమ్మని. మా నాన్న మా అమ్మ చేతిలో తోలు బొమ్మ" అన్నాడు హీరోతో.

గంభీరంగా నవ్వాడు హీరో. "మనమంతా ఆ దేవుడి చేతుల్లో ఆట బొమ్మలం" అని సై. హీరో భుజం తట్టి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళినవైపే చూసి చేతులు జోడించి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటాడు సై. హీరో. (ని. ర.స. మన పిక్చర్లో కన్నీళ్ళ సన్నివేశాలు చాలా ఉన్నాయి. కాబట్టి ఏకంగా హోల్‌సేలున ఒక కిరసనాయిల డబ్బాడు గ్లిజరిన్ కొనేసుకుంటే లాభం.)

నెక్స్ట్ సీన్ : హీరో ఇంట్లో గుడ్డి తల్లికి పరిస్థితి వివరించాడు హీరో. గుడ్డి తల్లి ససేమిరా ఒప్పుకోలేదు. "నాయనా అనాథలం—మమ్మల్ని తీసుకొచ్చి ఇంత బాగా చూస్తున్నావు. అంతే చాలు. ఈ షరతుకి ఒప్పుకోకు. వేరే సంబంధం చూడు. అదీగాక ఈనాడు నిన్ను బికారిని చేసిన వాళ్ళు రేపు నన్నూ పొమ్మనరా? ఏదో నీడ పట్టున పడి ఉన్నాను. మళ్ళీ కష్టాలు పడలేను. ఈ పాడు వ్యవహారం మనకు వద్దు" అంది.

అక్కడే నుంచుని ఉన్న సై. హీ. అంతా విని లోపలికి పరిగెట్టింది. వెనకే వెళ్ళాడు హీరో. "ఎందుకు, తల్లీ ఏడుస్తున్నావు" అన్నాడు తల నిమురుతూ.

"అన్నయ్యా! నేను కాలు జారాను" అంది సై. హీ. ఏడుస్తూ.

"అయొడెక్సు రాసుకోమ్మా" అన్నాడు హీరో నర్మిచెప్తూ.

మరింత పెద్దపెట్టున ఏడిచింది సై. హీ. "అయ్యో నీకెలా చెప్పా అన్నయ్యా. నేను ఈ కాలు జారటం కాదు. ఆ కాలు జారాను" అంది.

హీరో ఉగ్రుడయ్యాడు. "ఏవిటీ—అంతనీచానికి తలపడ్డాడా ఆ దుర్మార్గుడు. వాడిని ప్రాణాలతో వదలను" అన్నాడు ఆవేశంగా.

వారించింది సై. హీ.

"ఆయన తప్పు ఏమీ లేదన్నయ్యా. అంతా నా బలవంతంమీదే జరిగింది" అంది దీనంగా.

దీర్ఘంగా నిట్టూర్చాడు హీరో. "పోనీలే, తల్లీ! మంచిపని చేశావు. నీ సుఖంకంటే, నీ సంతోషం కంటే నాకు కావలసింది ఏముందమ్మా? నీకోసం నా ప్రాణమైనా ఇవ్వగలను. అటువంటిది హు. ఈ తుచ్ఛమైన ఆస్తి ఇవ్వలేనా? తృణప్రాయంగా భావించి ఇచ్చేస్తానమ్మా" అన్నాడు దృఢంగా.

భోరున ఏడిచింది. సై. హీ.

"అయ్యో వద్దు, అన్నయ్యా! కాలే జారానుగానీ, కడుపు రాలేదుగా. ఈ సంబంధం వదిలేసుకుందాం" అంది.

ఉలిక్కి పడ్డాడు హీరో. "తప్పమ్మా! అలా అనకూడదు. భారతదేశంలో—ఏది పవిత్ర భారత దేశంలో జన్మించిన స్త్రీకి ఒకడే భర్త, తల్లీ! కష్టమైనా, సుఖమైనా అతనితోనే. అతనితోనే జీవితం పంచుకోవాలి. అతడినే దైవంగా భావించాలి. ఇది తరతరాలుగా, యుగయుగాలుగా వస్తున్న సాంప్రదాయం, తల్లీ! ఆనాడు సీత, అనసూయ, సుమతిలాటి పతివ్రతలు మన జాతికి గర్వకారణంగా, తలమానికలుగా, ఆణిముత్యాలుగా చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోయారు. వాళ్ళని ఆదర్శంగా తీసుకుని నేటి స్త్రీలు కూడా నడిచిపోవాలి" అన్నాడు గంభీరంగా (ద. ర. స.—నాలుగు ఓకులు పాడైనా సరే కాస్త బాగా ఈ డైలాగు స్పష్టంగా హీరోచేత పలికిస్తే తప్పకుండా చప్పట్లు కొడతారు ప్రేక్షకులు.)

సై. హీ. కళ్ళల్లో నీళ్ళు. "అన్నయ్యా! నీలాటి మహానుభావుడికి, నీలాటి గొప్పవాడికి, నీలాటి త్యాగమూర్తికి చెల్లెలి ననటం నా అదృష్టం, అన్నయ్యా! కేవలం నా పూర్వజన్మ సుకృతం. జన్మ జన్మలకీ నీ చెల్లెలినయ్యే అదృష్టం కావాలని ప్రార్థిస్తున్నాను, అన్నయ్యా" అంటూ అన్నయ్య కాళ్ళమీద పడుతుంది.

లేవనెత్తాడు హీరో. చిరునవ్వులు చిందిస్తూ— "పిచ్చి తల్లీ! ఎందుకమ్మా నీ కీ అన్నయ్య అంటే అంత ఇష్టం?" అంటూ గాఢంగా కావిలించుకుంటాడు హీరో.

తరవాతి సీన్. పూరంతా దద్దరిల్లి పోయేలాగా సై. హీ. పెళ్ళి. దానికి అతిథుల్లో హీరోయిన్, హి. తండ్రి, సై. హి. తండ్రి, విలన్ కూడా ఉంటారు. విలన్ హీరోయిన్ని చూసి గుటకలు మింగుతాడు. హీరోయిన్ హీరోని చూసి లొట్టలు వేస్తూ ఉంటుంది. హీరోమాత్రం పెళ్ళికూతురిని చూస్తూ ఉంటాడు. మాంగల్యం తంతునానేనా అని బాగ్రౌండ్‌లో మంత్రాలు. సై. హీరో సై. హీ. మెడలో తాళి కట్టేస్తాడు. విలన్ హి. తండ్రిని చెయ్యి పట్టుకుని పక్కకు లాక్కుపోతాడు. చెవిలో ఏదో చెప్తాడు. వెంటనే హి. తండ్రి ముఖంలో రంగులు మారిపోయాయి. వెంటనే చర చర వచ్చి ఒక మూల నిలబడి చిరునవ్వులు చిందిస్తున్న హీరోయిన్ని జబ్బ పుచ్చుకుని లాక్కుపోతాడు.

తరవాత సీన్. హీరోయిన్ ఇల్లు. "నాన్నా ఏవిటీ దవుర్జన్యం?" అంది హీరోయిన్.


ఏవిటి అన్నావు హీ. తండ్రి తాపీగా

"ఇంకా ఏవిటని అడుగు తున్నారా. నా ఆడపడుచు పెళ్ళి జరుగుతూ ఉంటే నన్ను మధ్యలో లాక్కు వచ్చేస్తారా!" అంది మండిపడుతూ.

"అవు. అది నీఆడపడుచూ కాదు. అతడు నీభర్త కాలేడు. ఉన్నదంతా చెల్లెలి పేర్న రాసి ఇచ్చాడట. ఆ బికారితో నీ స్నేహం చాలించు" అన్నాడు.

"ఏమిటి, నాన్నా, మీరు చెప్పేది? డబ్బులేనంత మాత్రాన అతన్ని వదులు కోనా? అయినా ఆయనకి ఏం తక్కువ? అతన్ని నేను ప్రేమించాను. అతన్నే పెళ్ళి చేసుకుంటాను" అంది ఆవేశంగా.

"నోర్ముయ్. ముద్దుగా పెంచానని నామాటకే ఎదురు చెప్తావా? ఇక అతన్ని మర్చిపో. నీ పెళ్ళి విలన్‌తో నిశ్చయం చేసేశాను. అతనికి ఎనభై




రెండు లక్షల ఆస్తి ఉంది. ఇతన్నే పెళ్ళి చేసుకోవాలి నువ్వు" అని గదిలోకి తోసి తలుపు వేసి వెళ్ళిపోయాడు హి. తండ్రి. హృదయ విదారకంగా విలపించ సాగింది హీరోయిన్.

తరవాతి సీన్. హీరో ఇల్లు. సై. హీ., సై. హీరో ఇద్దరూ పూల దండలతో నిలబడి ఉన్నారు. హీరో సై. హీరో దగ్గరకు వెళ్ళాడు.

"బావా నేను వెళ్ళి పోతున్నాను. నా చెల్లెల్నీ, ఈ ఇంటినీ, ఈ సంపదను నీకు ఇచ్చి వెళ్ళిపోతున్నా. నా చెల్లెల్ని జాగర్తగా చూసుకో" అని, సై. హి. తండ్రి దగ్గరకు వెళ్తాడు. "మీరు అన్నట్లే నా యావదాస్తీ నా చెల్లెలికి ఇచ్చేశాను. కట్టుబట్టలతో వెళ్ళి పోతున్నాను" అన్నాడు.

ఆ వెంటనే పనివాళ్ళకి అందరికీ చెప్పాడు— 'రామయ్య వెళ్ళొస్తాను', 'సుబ్బయ్యా వెళ్ళొస్తాను' అంటూ శాంతమ్మ దగ్గరకు వచ్చి—"శాంతమ్మా! నన్ను చిన్నపిల్లాడప్పటి నుండి పెంచావు. నేను వెళ్ళి




పోతున్నాను. అమ్మని జాగ్రత్తగా చూసుకో'' అని చెప్తాడు. ''అమ్మా నేను వెళ్తున్నాను'' అన్నాడు, గుడ్డి తల్లికి దణ్ణం పెట్టి. అందరూ గొల్లున ఏడుస్తారు.

హీరో వెనుతిరిగి గడపదాటి రోడ్డు మీద నడక ప్రారంభిస్తాడు. బ్యాక్‌గ్రౌండ్, ఎవరికీ తెలియని అశరీరవాణి పాడుతూంది. పాట:— కదిలాడమ్మా త్యాగమూర్తి, కాలు జారిన చెల్లికోసం, కళ్ళులేని తల్లికోసం కలిమిని కాలదన్ని, కదిలాడమ్మా'' అంటూ

నెక్స్ట్ సీన్: హీరోని స్నేహితులు చుట్టుముట్తారు. ''బ్రదర్ మాతోఉండువుగాని రా'' అని ఆహ్వానిస్తారు. ''నేను రాను. నా కాళ్ళ మీద నేనే నిలబడతాను. అందుకే కష్టపడతాను. మీ అభిమానికి కృతజ్ఞుడిని'' అంటాడు ఠీవిగా. ''సరే నీఇష్టం'' అని తలవూపుతారు ఆ స్నేహితులు.

తరవాత సీన్. హీరో చిన్న లాండ్రీ పెట్టుకుంటాడు (ద.ర.స. లాండ్రీ ఎందుకు అని అనుకోవచ్చు. ఇప్పటి దాకా వచ్చిన చిత్రాల్లో హీరో రిక్షా తొక్కి, రాళ్ళుకొట్టి, తట్టలు మోసి, టాక్సీ నడిపి, సర్వర్ పనిచేసి—ఇలా అనేక అవతారాలు చూసే ఉన్నాం కాబట్టి లాండ్రీ పెట్టిస్తే బాగా ఉంటుంది. కాస్త చేంజ్ ప్రేక్షకులకి.)

వి.ర.స.:— కథ వినేటప్పుడు హీరో—''చ చ ఇదేమిటి. ఇంత బ్రతుకూ బ్రతికి బట్టలుతికే వేషం వేస్తానా?'' అంటాడేమో. పరవాలేదు. నువ్వు బట్టలుతికే సీనులేదు. జస్ట్ ఒక్క నిముషం ఇస్త్రీ ఇస్త్రీ పెట్టెతో అలా అలా సున్నితంగా ఒక షర్టు చేస్తే చాలు అని చెప్పాలి.

సరే. హీరో సున్నితంగా ఇస్త్రీ చేస్తూ ఉంటాడు. చుట్టూరా బట్టల మూటలు. ఒక అవ్వ వచ్చి ''బట్టలు అయినాయా నాయినా'' అని అడిగింది.

''అయినాయి అవ్వా'' అంటూ ఇస్త్రీ పెట్టి పక్కన పెట్టి మడతలు పెట్టి ఉన్న బట్టలు తీసుకొచ్చి అందించాడు.

''మా నాయనే నీ అంత మంచి చాకలిని నేను ఎక్కడా చూడలేదు. ఇదుగో నాయినా నీ కోసం పిండి వంటలు తెచ్చాను'' అంటూ అయిదు గిన్నెలు స్టీలు కారేజి అందించి బట్టలు తీసుకుని వెళ్ళి పోయింది అవ్వ.

తరవాత సీన్: హీరో మంచి బట్టలు వేసుకుని హీరోయిన్ ఇంటికి బయలు దేరుతాడు.

అక్కడ మధ్య హాల్లో కూర్చుని ఉంది హీరోయిన్. పెళ్ళి చూపులు జరుగుతూ ఉంటాయి. ఎదురుగా విలన్—కోరచూపులు చూస్తూ, గర్వంగా నవ్వుకుంటూ కాలు ఊపుతూ కూర్చుని ఉన్నాడు. 'పాట పాడించండి' అన్నాడు విలన్‌తండ్రి. వెంటనే వీణ తీసుకొచ్చి అందించారు పనివాళ్ళు. విసురుగా కింద పెట్టింది హీరోయిన్. హీ. తండ్రి కోపంగా చూశాడు కూతురి వంక. మళ్ళీ విసురుగా వీణ చేతుల్లోకి లాక్కుంది హీరోయిన్. విసురుగా వాయించటం మొదలు పెట్టింది.

ద. ర.స:— ఈవిడకి మనం రెండు చేతులతో వాయించు అని చెప్పనక్కరలేదు. మనం ఎంత చెప్పినా ఆవిడ రెండు చేతులతో వాయించదు. అందుకని లాంగ్‌షాట్లు లాగేసి పని గడిపేస్తే సరిపోతుంది.

పాట: నవ్వుకురా వెర్రివాడా నా ప్రియుడు వస్తాడు నీ పళ్ళు రాలగొడతాడు'' అంటూ పాడుతుంది హీరోయిన్. విలన్, విలన్ తండ్రి, హీ.తండ్రి తన్మయంగా తలలు ఊపుతూ వింటున్నారు.

హీరో ప్రవేశం. అతన్ని చూడగానే పాట ఆపేసి, వీణ విసిరేసి అతని వైపు పరిగెడుతుంది హీరోయిన్. ఆగు అని గర్జించాడు హీ. తండ్రి. ఆగింది హీరోయిన్. హీరో దగ్గరగా నడిచాడు హీ. తండ్రి. వాళ్ళిద్దరి సంభాషణ—

హీ. తండ్రి— ఎందుకు వచ్చావ్?

హీరో:—హీరోయిన్ కోసం.

హీ.తండ్రి: అదే హీరోయిన్‌కోసంఎందుకువచ్చావ్?

హీరో: హీరోయిన్‌తో పని ఉంది.

హీ. తండ్రి: అదే హీరోయిన్‌తో పని ఉండి ఎందుకు వచ్చావ్?

(ఇంకావుంది)

# స్క్రిప్టు సిద్ధంగా ఉంది
# సినిమా తియ్యండి – జయంతి

**( క్రిందటి సంచిక తరువాయి )**

హీరో : హీరోయిన్ని నేను ప్రేమిస్తున్నాను. అందుకే ఆవిడకోసం వచ్చాను.

హీరో తండ్రి : హీరోయిన్ని ప్రేమించినా సరే ఎందుకు వచ్చావు?

హీరో : ఏం? రాకూడదా? అయినా హీరోయిన్‌కోసం రావడం ఇది మొదటిసారి కాదుగా.

హీరో తండ్రి : అవును. అప్పటి సంగతి వేరు. ఆనాడు నీకు తొంభై రెండు లక్షల ఆస్తి ఉండేది. అందుకే నిన్ను రానిచ్చాను. ఇప్పుడు నీకేమీ లేదు. అలాటప్పుడు ఎందుకు వచ్చావ్?

హీరో : డబ్బులేక పోవచ్చు. కానీ నా ప్రేమ మాత్రం అలాగే ఉంది.

హీ. తండ్రి : ప్రేమ ఉంటే సరిపోదు. డబ్బు కూడా కావాలి. ఇదుగో ఇతనికి నా కూతురంటే ప్రేమ ఉంది, ఎనభై రెండు లక్షల ఆస్తి కూడా ఉంది. అందుకే అతనికి మా అమ్మాయి నిచ్చి పెళ్ళి చేసేస్తున్నాను. నువ్వు పో.

హీరో : ఇది చాలా అన్యాయం. డబ్బు లేనంత మాత్రాన నా ప్రేమను ఇంత తేలికగా తీసేస్తారా? అయినా ఆ మాత్రం డబ్బు నేను మళ్ళీ సంపాదించగలను. అసలు ఇప్పటికే బట్టలు ఉతికి హాయిగా బ్రతుకుతున్నాను.

హీ. తండ్రి : ఛీ. ఛీ. బట్టలు ఉతుకుతున్నావా? అంత నీచమైన పనిచేసే నీకు నా పిల్లనిస్తానా?

హీరో : ఆగండి. ఏమిటి మీ ఉద్దేశ్యం? బట్టలుతికేవాడు నీచుడా? ఎంతమాత్రం కాదు. అతడా పని నీచంగా భావిస్తే మీరంతా—ఏది ఇన్ని లక్షలుగల మీరంతా— మాసిన బట్టలు కట్టుకు తిరగాల్సిందే? మీ సంతోషంకోసం, మీ సుఖంకోసం, మీకోసం మీ మురికి బట్టలను పవిత్రంగా భావించి వాటిని శుభ్రపరచటమే తన కర్తవ్యంగా భావించి, తన వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్న అతను నీచుడా? అలా అయితే మీకోసం పనిచేసే వాళ్ళంతా నీచులేనా? కాదు. ఎంతమాత్రం కాదు. వాళ్ళంతా పవిత్రమైనవారు. మహానుభావులు. వాళ్ళ శ్రమతో పైకి వచ్చి వాళ్ళ కష్టాన్ని కొల్లగొట్టి మేడలు కడుతున్న మీరంతా నీచులు.

(ద. ర. స. ఈ డైలాగు కాస్త ఆవేశంగా చెప్పించాలి. )

హీ. తండ్రి : నన్ను నీచుడు అంటావా? ఫో బయటికి పో.

హీరో : వెళ్తున్నాను. కానీ ఒక్కటి గుర్తుంచుకోండి. మా ప్రేమ పవిత్రమైనది. మమ్మల్ని మీరేకాదు ఆ భగవంతుడు కూడా విడదీయలేడు.

అనేసి వో వోరచూపు హీరోయిన్ మీద విసిరి బయటికి నడిచాడు హీరో. హీ. తండ్రి, విసురుగా వెనక్కి తిరిగి మొహాన నవ్వు పులుముకుని 'కూర్చోండి' అంటాడు. విలన్, విలన్ తండ్రి కూర్చుంటారు.

"నువ్వూ కూర్చో" అన్నాడు హీరోయిన్ని.

"నేను కూర్చోను" అంది హీరోయిన్.

"ఎందుకూ?" అన్నాడు హీ. తండ్రి కోపంగా.

"నాన్నా! ఏమిటి మీ ఉద్దేశ్యం. స్త్రీకి ఒకటే మనసు, నాన్నా! ఆ మనసుని ఎవరికి అర్పిస్తే అతడే స్త్రీకి సర్వస్వం. అతడే ఆమెకి ప్రాణం. అంతే కానీ, ఒకనాడు ఉండి మరోనాటికి పోయే అశాశ్వతమైన డబ్బుకోసం, మరొకడికి మనసు ఇవ్వగలదా ? నా స్వామికి, నా ప్రాణేశ్వరుడికి ఇంత అవమానం జరిగాక ఈ ఇంట్లో ఇంకా క్షణం కూడా ఉండను" అంటూ వాకిలివైపు నడిచింది.

"ఆగు. ఎక్కడికి వెళ్తావు?" అన్నాడు హీ. తండ్రి.

"ఎక్కడి కేమిటి, నాన్నా? నా ప్రియుడి దగ్గరకు. మీరు మా పెళ్ళి జరిపినా, జరపక పోయినా అతడే నా భర్త. వెళ్ళిపోతున్నాను" అంటూ బయటికి నడిచింది.

(ద. ర. స. : అప్పుడు హీరో ఇల్లు వదిలి వెళ్ళిపోయేటప్పుడు పాడించే పాట దాని మరో భాగం ఇపుడు.

పాట: కదిలిందమ్మ కదిలిందమ్మా ప్రేమమూర్తి
మనసిచ్చినవాడికోసం,
మాంగల్యం లేకుండానే,



మనసులేని తండ్రిని వదిలి..

హీ. తండ్రి దిగులుగా లోపలికి వచ్చాడు. విలన్ పటపట పళ్ళు కొరికేస్తున్నాడు. "హు మీరేమీ భయపడకండి, మామగారూ! మీ అమ్మాయి మనసు మార్చి నా పాదాక్రాంతం చేసుకుంటాను" అని శపథం చేశాడు. హీ. తండ్రి ముఖం వికసించింది.

తరవాత సీను. హీరో లాండ్రిలో కూర్చుని బట్టలు లెక్క చూసుకుంటూ ఉంటాడు. హీరోయిన్ ప్రవేశం.

"ఏవండీ !" అని పిలిచింది.

తల ఎత్తి చూశాడు హీరో, అమిత ఆశ్చర్యంగా.

"నువ్వా? నువ్వా?" అన్నాడు.

తల వంచుకుంది హీరోయిన్.

"ఓహో పెళ్ళికి పిలవటానికి వచ్చావా?" అంటాడు హీరో.

భోరున ఏడిచింది హీరోయిన్.

వెంటనే దగ్గరకు వెళ్ళి కావిలించేసుకుంటాడు. "ఎందుకు ఏడుస్తున్నావ్?"

"ఏడవక ఏం చెయ్యను? నిన్ను తప్ప మరొకరిని పెళ్ళి చేసుకోగలనా?"

హీరోయిన్ని వదిలేసి వెనక్కి తిరిగి కిటికీ దగ్గరకు వెళ్ళి దీర్ఘంగా నిట్టూర్చాడు. "మరోసారి ఆలోచించుకో నేను పేదవాడిని. నా దగ్గర డబ్బు లేదు. నా కిపుడు ఫాక్టరీలు, కార్లు, బంగళాలు లేవు. నేను నిరుపేదను" అన్నాడు.

వెనకనుండి కావిలించేసుకుంది హీరోయిన్. "నాకు కావల్సింది బంగళాలు, కార్లు కాదు. నువ్వు నువ్వు కావాలి. నీకోసం అన్నీ వదిలేసి వచ్చేశాను. నీలాగే నేనూ కష్టపడతాను. ఇవ్వాళ్ళా, రేపు కాల్‌గాస్ దొరకక జనం చాలా అవస్థలు పడుతున్నారు. నా బంగారం అమ్మి నాలుగు గేదెలు, నాలుగు ఆవులూ కొని, పేడ, పిడకల వ్యాపారం చేస్తాను. డబ్బు సంపాదిస్తాను. నన్ను కాదనకు" అంది దీనంగా.

హీరో కళ్ళల్లో నీళ్ళు. వెనక్కి తిరిగిపోయి హీరోయిన్ని గాఢంగా కావిలించేసుకున్నాడు. 'హీరోయిన్". "హీరో", "నా హీరోయిన్" "నా హీరో" "నా ముద్దుల హీరోయిన్" "నా అల్లరి హీరో"

(ద.ర.స. ఈ సీన్లో హీరో, హీరోయిన్లని వదిలేసి మీ ఇష్టం అని కెమేరా ఆన్ చేసుకుని కూర్చుంటే చాలు. వాళ్ళ కౌగిలింత ముగిశాక కట్ అనేయచ్చు. సెన్సార్ చూసుకుంటుంది మిగతా విషయాలు అన్నీ. )

ఇక ఇక్కడినించి పిక్చరు స్పీడు అందుకుంటుంది. హీరోయిన్ ఆవులని, గేదెలని పెట్టి పిడకల వ్యాపారం చేసుకుంటుంది.

(ని.ర. స. కథ విన్నప్పుడు పేడ ముట్టుకోడానికి హీరోయిన్ అసహ్యించుకుంటే ఆవిడకి 'పేడకాదుబంక మట్టితో చిన్నప్పుడు ఆడుకోలేదూ నువ్వు ? అలాటి మట్టినే పేడగా చూపించేద్దాం' అని చెప్పాలి. )


ఇక టక టక సీన్లు మార్చేయాలి. చిన్న లాండ్రీ షాపులో ఉండే హీరో మరుసీన్లో కొంచెం పెద్ద లాండ్రీ షాపులో ఉంటాడు. నెక్స్టు చిన్న డ్రై క్లీనింగ్ షాపు, సైకిలు, తరవాత పెద్ద డ్రై క్లీనింగ్ షాపు, స్కూటరు, చిన్న స్వంత ఇల్లు. తరవాత మరికొంచెం పెద్ద డ్రైక్లీనింగ్ షాపు, నలుగురు పనివాళ్ళు, ఫియట్ కారు, మేడ.

ఇక తరువాతి సీన్. ఆరంతస్థుల డ్రైక్లీనింగ్ సెంటరు, నాలుగంతస్థుల ఇల్లు, మెర్సిడిజ్ బెంజు కారు.

ఇటు హీరోయిన్, మొదటి సీన్ చిన్న పాక, ఒక చిన్న పేడ (అదే మట్టి కుప్ప) చిన్న పిడకల తట్ట, నాలుగు ఆవులు.

తరవాత పది ఆవులు, ఒక లారీడు మట్టికుప్ప, ఇరవై పిడకల బుట్టలు. ఒక చిన్న పెంకు టిల్లు.

నెక్స్టు సీన్, వంద బర్రెలు. ఇరవై మంది




అసిస్టెంట్లు, రెండు చిన్న కొండలంత మట్టి కుప్పలు. నాలుగు ఎద్దు బళ్ళు (పిడకల బుట్టల బదులు )

ఇక ఆఖరి సీన్. ఒక పెద్ద మైదానం నిండా ఆవులూ, గేదెలు వేలాదిమంది అసిస్టెంట్లు, బయట ఆరు లారీలు (పిడకల ఎక్స్‌పోర్టుకు), పెద్ద ఇల్లు (ఉండటానికి), దాని ఎదురుగా చిన్న కారు.

(ద. ర. స.: నేను వరసగా రాసుకు వచ్చేశాను కానీ, సినిమాలో ఒక సీన్ హీరో అభివృద్ధి, ఒక సీను హీరోయిన్ అభివృద్ధి చూపించాలి)

హీరోయిన్ మేడ దిగి వచ్చింది. సెక్రటరీ వచ్చి పక్కల నిలబడి "మేడమ్!" అన్నాడు.

మెడలోని పొడుగాటి గొలుసు సుతారంగా సవరించుకుంటూ' "ఎస్" అంటుంది హీరోయిన్.

"మేడమ్ మనకు అమెరికానుండి ఆర్డర్ వచ్చింది. అక్కడి వాళ్ళకు లక్ష రూపాయల పిడకలు కావాలిట" అన్నాడు, నోట్ బుక్కు తెరిచి.

"ఎస్. సప్లయ్ చేయించండి" అంది హీరోయిన్ చిరునవ్వుతో.

"మేడమ్ మీ ప్రజ్ఞ అమోఘం. నిజంగా పిడకల బిజినెస్ చేసి ఏడాదిలోపల ఇన్ని లక్షలు సంపాదించిన వారిని మిమ్మల్నే చూశాను" అన్నాడు సెక్రటరీ, వెధవ నవ్వు నవ్వుతూ.

"ఇట్సాల్ రైట్. పొగడ్తలు నా కిష్టం ఉండదు" అంటూనే నడిచి బయటకి వచ్చి కారు ఎక్కి డ్రైవ్ చేసుకుంటూ తన పేడ కంపెనీకి వెళ్తుంది. అక్కడ దిగి పనివాళ్ళని, బర్రెలని పలకరిస్తూ పిడకలు సరిగా తయారు అవుతున్నాయో, లేదో పర్యవేక్షిస్తూ ఉంటుంది.

తరవాతి సీన్. హీరో పెద్ద వేదికమీద నిలబడి ఉంటాడు. అతని మెడలో మోకాళ్ళ దిగిన పూల దండ. మైకు ముందు నిలబడి, "సోదర సోదరీ మణులారా! నన్ను అంతర్జాతీయ చాకళ్ళ సంఘానికి చెయిర్మన్‌గా ఎంచుకున్నందుకు ఎంతో కృతజ్ఞుడిని. మీరు నామీద ఉంచిన బాధ్యత నెరవేరుస్తాను" అని కరతాళ ధ్వనుల మధ్య కూర్చుంటాడు.

(ద. ర. స. ఇక్కడ చాలా పెద్ద డైలాగు ఉండాలి. మాటల రచయిత చూసుకుంటారు.)

తరువాతి సీన్. హీరో కారులో పూల దండలతో హీరోయిన్ దగ్గరికి వస్తాడు. హీరోయిన్ పశువుల యార్డులో తిరుగుతూ ఉంటుంది.

వెనకగా నుంచుంటాడు హీరో. రెండు నిముషాలు అయ్యాక తిరిగి చూస్తుంది హీరోయిన్.

"అరే నువ్వు ఎపుడు వచ్చావు?" అంటుంది కళ్ళు పెద్దవి చేసి. వెంటనే బాక్‌గ్రౌండ్ ధన ధనమని డిస్కో మ్యూజిక్. వెంటనే హీరో డాన్సు. పాట—"తెల్ల ఆవు వేసింది నల్లపేడ ఆ క్షణమే వచ్చాను నిన్ను చూడ."

ఆ వెంటనే హీరోయిన్ అందుకుంటుంది : "నల్ల ఎద్దు వేసింది నల్లపేడ. నేను కూడా వీచాను నిన్ను కూడ."

ఇక ఇద్దరూ ఎద్దుల మధ్య నించి, ఆవుల మధ్యనించి పిచ్చివాళ్ళలాగా పరిగెడుతూ డాన్సు చేస్తారు.

(ద. ర. స. : మిగతా ప్రైములో ఏ బట్టలు వేసినా వేయకపోయినా ఈ పాటకి మాత్రం ఎరుపు రంగు, దానికి దగ్గరగా ఉండే రంగు బట్టలు ఎంతమాత్రం వెయ్యకూడదు. ఎందుకంటే పశుజాతికి ఎర్రరంగు ఎలర్జీ. మనకంటే హీరో, హీరోయిను అంటే భయం, గౌరవం. కానీ వాటికేం భయం చెప్పండి ? కుమ్మి పారేస్తాయి)

(ని. ఈ స.: దర్శకులు తనకేం అని పూరు కుంటారేమో మీరు దగ్గరే ఉండి ఈ డ్రస్ విషయంలో కాస్త జాగర్తగా ఉండాలి. ఎందు కంటే ఏ ఎద్దన్నా పొడిచి ఏ కాలో విరిగితే మళ్ళీ ఏ అమెరికానో పట్టుకుపోవాలి. ఎంత చేసినా విష్కారాలు తప్పవు. అంత్య నిష్కారంకన్నా ఆది విషా రం మేలు. ఈ విషయంలో నిర్మాహ మాటంగా ఉండాలి. )

సరే డ్యూయట్ అయిపోయింది. ఇద్దరూ పశువుల మధ్యనుంచి వచ్చిక బయళ్ళల్లోకి వెళ్ళి పోయారు హీరోయిన్, ఆవిడ పక్కన హీరో. "మనం ఎప్పుడు పెళ్ళి చేసుకుందాం?" అంది హీరోయిన్ గోముగా.

"నిజమేసుమా! అమాటే మర్చిపోయాను. నీ ఇష్టం—నువ్వు ఎప్పుడంటే అప్పుడే" అన్నాడు హీరో ప్రేమగా.

"తొందరగా చేసుకుందాం" అంది హీరోయిన్ మత్తుగా".

"అలాగే. వెంటనే ఇంటికి వెళ్ళి అమ్మకి చెప్పి అమ్మ ఆశీర్వాదం తీసుకుందాం" అంటూ హీరో యిన్‌ని నడుం పట్టుకుని లేవదీసి కారు వైపు నడిపిస్తాడు హీరో. ఇద్దరు కారులో ఎక్కి బయలుదేరారు.

తరవాత సీన్: హీరో వదిలేసి వచ్చిన సైడ్. హీరో ఇల్లు. వీళ్ళు లోపలికి అడుగు పెట్టగానే సై.హీ. పరుగున వచ్చి "అన్నయ్యా" అని కావిలించు కుంది.

ఇద్దరూ లోపలికి వచ్చారు.

"ఏమిటన్నయ్యా విశేషం? వదినని కూడా. తీసుకు వచ్చావు?" అంది సై. హీ. కొంటెగా.

"ఛీ పో అల్లరి పిల్లా!" అంది హీరోయిన్ చిరు కోపంతో.

అందరూ గుడ్డి తల్లి దగ్గరికి నడిచారు.

లోపలినించి సై. హీరో వచ్చాడు. "ఏం బావా" అంటూ.


అందరూ కూర్చున్నాక హీరో సంభాషణ: "అమ్మా! నేనూ, ఈ అమ్మాయి పెళ్ళి చేసుకుందాం అనుకుంటున్నాం."

"అలాగే, నాయనా, అంతకన్నానా? కానీ పెళ్ళి అంటే చాలా తతంగం ఉంది. ఆ అమ్మాయి తండ్రి కన్యాదానం చెయ్యాలి" అంది గుడ్డి తల్లి.

"మా నాన్నగారు ఒప్పుకోరు, అత్తయ్యా! ఆయనకి మనసు లేదు. ఆయనకి డబ్బే ప్రధానం" అంటుంది ఆవేశంగా హీరోయిన్.

"కాదు, తల్లీ" అని వాకిట్లోంచి సమాధానం. అందరూ అటు చూశారు. హీ. తండ్రి. వెంటనే హీరో లేచి వెళ్ళాడు.

"రండి, మామయ్యగారూ, రండి. నేను మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి. నేను డ్రై_




క్లీనింగ్ షాప్ పెట్టి ఈ ఏడాదిలో డెబ్బయి రెండు లక్షల ఆస్తి సంపాదించాను. నాకు మీ కూతుర్ని ఇచ్చి పెళ్ళి చెయ్యండి" అన్నాడు, ఆయన రెండు చేతులు పట్టుకుని.

"చచ్చిన పాముని ఇంకా చంపకు, నాయనా! డబ్బుకి ఎంతమాత్రం విలువలేదని గ్రహించాను. నన్ను మన్నించు. నేను చాలా మారిపోయాను. నా కూతుర్ని నా ఇంటికి పంపించు. దాన్ని నీకు ఇచ్చి పెళ్ళి చేస్తాను" అన్నాడు హీ. తండ్రి.

హీరోయిన్ కళ్ళలో ఆనంద బాష్పాలు. వెంటనే పరుగున వచ్చి నాన్నా అని కావిలించు కుంది.

సై. హీరో లేచివచ్చి, "ఈ శుభసందర్భంలో మా పెళ్ళికి మీరు ఇచ్చిన డెంభై రెండు లక్షల ఆస్తి కూడా తిరిగి ఇచ్చేస్తున్నాను" అన్నాడు.

గుడ్డి తల్లి తడువుకుంటూ వచ్చి, "నాయనా ఈ శుభ సందర్భంలో అందరం గుడికి వెళ్దాం" అంది. సరే అని అందరూ గుంపుగా గుడికి బయలు దేరారు. గుడి ముందు కారు ఆపి దిగి లోపలికి వెళ్ళారు. వీళ్ళందరినీ చూశాడు ఆ పక్కన కిల్లీ కొట్టుదగ్గర నిలబడ్డ విలన్. చూసి పళ్ళు పటపట కొరికాడు.

అందరూ గుడిలోకి వెళ్ళారు (ద.ర. స.: ఇక్కడ గుడికి ఒక పక్కగా కొంతమందిని కూర్చోపెట్టి భజన చేయించాలి ) పాట : రామారామా రామా రామా. దేవుని ఎదుట హీరో, హీరోయిన్, గుడ్డి తల్లి, సై. హీ., సై. హీరో, హీ. తండ్రి వరసగా నిలబడ్డారు. పూజారి లోపలినుండి వచ్చాడు. గుడ్డితల్లి పూలు, కొబ్బరికాయలు ఉన్న బుట్ట అందించింది (ద. ర. స. : కొబ్బరికాయకి క్లోజప్ తియ్యాలి. ) పూజారి లోపలికి వెళ్ళాడు. పూజ మొదలు పెట్టాడు. భజన జోరుగా సాగు తోంది. మళ్ళీ కొబ్బరి కాయకి క్లోజప్. పూజారి పూజ చేస్తున్నాడు. భజన. కొబ్బరికాయ. పూజారి. భజన. కొబ్బరికాయ. పూజారి పూజ ముగించాడు. కొబ్బరికాయ చేతిలోకి తీసుకున్నాడు. రాముల వారి విగ్రహం క్లోజప్. గుడ్డితల్లికి క్లోజప్. కొబ్బరి కాయకి క్లోజప్. భజన జోరేతి జోరుగా సాగు తూంది.

పూజారి కొబ్బరికాయ కొట్టాడు. పెద్ద చిప్ప

అక్కడే పడిపోయింది. చిన్న చిప్ప గర్భగుడిలోంచి ద్వారం దాటి హీరో హీరోయిన్‌లను దాటి సూటిగా గాలిలో దూసుకు వచ్చి గుడ్డితల్లి తలమీద టపా మని తగిలింది. గుడ్డి తల్లి అమ్మ అంటూ కింద కూలబడింది.

అందరూ ఆవిడ చుట్టూ మూగారు "అమ్మా అమ్మా" అంటూ ఆక్రోసిస్తోంది స్పై. హీ. గుడ్డి తల్లి మెల్లిగా కదిలింది. అతి మెల్లిగా కళ్ళు విప్పింది. "నాకు—నాకు—నాకు— నాకు— నాకు — నాకు — నాకు — నాకు — నాకు కళ్ళు కనిపిస్తున్నాయి" అంది ఆనందంతో. సంతోషంతో పిచ్చిదై పోయింది స్పై. హీ.

"అమ్మా" నిజంగానా" అంటూ వలవల ఏడవ సాగింది.

"అమ్మా ఎన్నాళ్ళకు చూశానే. తల్లీ, నిన్ను" అంటూ కూతుర్ని కావిలించుకుంది తల్లి. అందరూ ఆనంద బాష్పాలు కారుస్తున్నారు. గుర్భగుడి అంతా దద్దరిల్లే పోయేలాగా అరుస్తున్నారు సంతోషంతో.

హఠాత్తుగా గుడ్డి తల్లి —"ఏడి? ఏడి ఆ పుణ్యమూర్తి? ఏడి ఆ మహానుభావుడు? ఏడి ఆ అమృత హృదయుడు? ఏడి నా బంగారు తండ్రి?" అంది అందరినీ చూస్తూ. వెంటనే సె. హీ—"ఇదుగోనమ్మా అంటూ" హీరోని చూపించింది.

"నాయనా ! ఇటు రా ! నా దగ్గరగా రా. మమ్మల్ని ఇంత ఆదరించిన వాడివి. మాకోసం నీ కున్నదంతా త్యాగం చేసిన వాడివి. నిన్ను కళ్ళారా చూడనీ నాయనా!" అంటూ ఆనందం పట్టలేక వలవల ఏడుస్తున్న హీరో ముఖాన్ని చెతుల్లోకి తీసుకుంది. రెండు క్షణాలు నిశ్శబ్దం. ఆ వెంటనే "నాయనా రమేషూ" అంటూ కేక పెట్టింది తల్లి. మళ్ళీ అంతా నిశ్శబ్దం. వెంటనే మళ్ళీ తల్లి కేక—"నాయనా రమేషూ తండ్రీ రమేసూ, నా బంగారుకొండా రమేషూ" అంటూ హీరో నోరు తెరిచాడు. స్పై. హీ. కూడా నోరు తెరిచింది. హీ. తండ్రి, హీరోయిన్, స్పై. హీరో, —ఎవరి నోరు వాళ్ళు తెరిచారు (ద. ర. స. : ఈ సీన్లు తీసేముందు చుట్టుపక్కలు అంతా డి. డి. టి. జల్లించేస్తే దోమలు నోట్లో దూరకుండా, మన సీన్ పాడవకుండా వుంటుంది.) స్పై. హీ. కేకపెట్టింది. "ఏమిటమ్మా నువ్వు చెప్పేది? అన్నయ్య నా అన్నయ్యా? మా అనయ్యా రమేషా?" అంటూ. "అవునమ్మా వాడే నా బంగారు తండ్రి రమేష్. ఆనాడు సిగరెట్టు పెట్టె తీసుకురావటానికి వెళ్ళాడు. పిచ్చి తండ్రి మళ్ళీ ఇన్నాళ్టికి చూస్తున్నాను. అదుగో ఆ మీసం పక్కన పెసరబద్దంత పుట్టు మచ్చ. నా బంగారు తండ్రి. అది చూసే వాడిని గుర్తుపట్టాను. నాయనా, నా తండ్రీ" అంటూ ఆక్రోశించింది తల్లి.

హీరో కళ్ళు వర్షిస్తున్నాయి. "అమ్మా అమ్మా" అంటూ తల్లిని కావలించుకున్నాడు. స్పై. హీ. ఆనందం పట్టలేక అన్నయ్యా అన్నయ్యా అంటూ హీరోని కావిలించుకుంది. తల్లిని వదిలి చెల్లిని కావిలించుకున్నాడు హీరో. "తల్లీ, నా బంగారు చెల్లీ, ఆనాడు నిన్ను రేపు చేద్దామనుకున్ననాడే అనుకున్నానమ్మా — నీకూ, నాకూ ఏదో అనుబంధం ఉందని. నా తల్లీ నా బంగారు చెల్లీ."

అంటూ ఎముకలు విరిగిపోయేలా కావిలించేసుకున్నాడు. హీరోయిన్ ఇదంతా చూసి ఆనందం పట్టలేక ఆ రాముడికి దణ్ణాలు పెట్టడం మొదలు పెట్టింది. స్పై. హీరో గంట విరిగి కింద పడిపోయేలా వాయించేస్తున్నాడు. జల జల ఆనంద బాష్పాలు కారుస్తూ హీ. తండ్రి ఆనందం భరించలేక గుండెలు బాదుకుంటున్నాడు.

ఇదంతా చూసి పూజారి—"ఆహా రామా! ఏమి నీ మహిమ? కళ్ళు లేని కబోదికి నీ మహిమవల్ల కొబ్బరి చిప్ప తగిలి చూపు వచ్చిందా, మహానుభావా? ఆహా పరంధామా" అని భక్తితో చేతులు జోడించాడు.

అందరూ ఆనందంతో ఏడ్చుకుంటూ ఇంటికి చేరారు.


# UMESH
## YOGA DARSHAN

(First Edition)
(In English or Hindi
A GUIDE TO HEALTHY LIVING...

a must in every home!
This illustrated Book explains various Yogic Asanas, to keep the body in perfect physical condition, free from constipation and other ailments. It also provides mental peace and tranquility. All Asanas are well described and hints on diagnosing disease are given, with a dietary guide.


Price: HINDI (Rs. 30/-);
ENGLISH (Rs. 30/-), Postage extra: Rs. 5/-.

**SHRI RAMTIRTH YOGASHRAM**
Dadar (C. Rly.), Bombay-400 014. Phone: 463209.




తరవాత సీన్: తల్లి, హీరో. తల్లి కుర్చీలో కూర్చుంది. ఆవిడ ఎదురుగా సోఫాలో హీరో. "అమ్మా, తమ్ముడు ఏడమ్మా?" అన్నాడు.

తల్లి ఏడిచింది. "ఏం చెప్పేదిరా, నాయనా! ఆ రోజు నువ్వు వెళ్ళిపోయావా. అందరం కబుర్లు చెప్పుకుంటూ ఉండగా అడుగుల శబ్దం వినిపించింది. తల ఎత్తి చూశాం అందరం. వాడే ఆ దుర్మార్గుడే—మీ నాన్నగారిని తన్నాడు. నన్ను తిట్టాడు. చెల్లాయిని కొట్టాడు. అందరినీ బయటికి ఈడ్చి కాళ్ళూ చేతులూ కట్టేసి కారులో పడేశాడు. మన ఇల్లు పడగొట్టాడు. తమ్ముడు పసి వెధవ మూడేళ్ళవాడు. ఎదురు తిరిగి తన్నబోతే వాడినీ కొట్టి కారులో పడేసి మమ్మల్నందరినీ ఒక పెద్ద పాడుబడ్డ ఇంటికి తీసుకువెళ్ళాడు. మమ్మల్ని అందరినీ స్తంభాలకు కట్టేశాడు. మీ నాన్నగారిని నానా మాటలూ అని



కాల్చి చంపాడు, నాయనా! నా కళ్ళల్లో పసిడిపోశాడు. నన్నూ, చెల్లెల్నీ, తమ్ముడిని బయటికి తరిమేశాడు. తమ్ముడు ఎదురుతిరిగి వాడిని తిట్టాడు. వెంటనే నా చేతుల్లోంచి తమ్ముడిని లాక్కుపోయాడురా, తండ్రీ! అప్పటి నుండి ఏ దిక్కూ లేక నానా కష్టాలూ పడి చెల్లెల్ని పెంచుకు వచ్చాను. ఇవ్వాల్టికి నువ్వు కనిపించావు. ఇక ఆ వెధవ ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో?" అంటూ ఏడిచింది మళ్ళీ.

భీకరమైన బాంక్‌గ్రౌండ్ మ్యూజిక్. హీరో ఆవేశంతో నిలువెల్లా వణికి పోతున్నాడు. కళ్ళు ఎర్రగా, భయంకరంగా ఉన్నాయి. తల మీద జుట్టు లేచి నుంచింది. "అమ్మా ఎంత అన్యాయం జరిగి పోయిందమ్మా? ఎంత ఘోరం జరిగింది. నాన్న గారు లేరా? తమ్ముడు ఎక్కడ ఉన్నాడో తెలియదా? ప్రతీకారం తీర్చుకుంటానమ్మా. నాన్నగారి ఆత్మకు శాంతి కలిగేలా చేస్తాను" అంటూ ప్రతిజ్ఞ చేశాడు హీరో.

తరువాత సీన్. హీరోయిన్ బెడ్‌రూం. హీరోయిన్ పడుకుని కూని రాగాలు తీస్తూ ఉంటుంది. హీరో ప్రవేశం.

"హాయ్" అంటూ లేచి అతని మెడ చుట్టూ చేతులు వేసి కావిలించుకుంది హీరోయిన్.

గంభీరంగా ఆ చేతులు విడిపించుకుని కిటికీ దగ్గర నిలబడి, "హీరోయిన్ నీతో ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు.

"ఏమి హీరో" అంది హీరోయిన్ ఆదుర్దాగా.

"నేను నా తల్లిని, చెల్లిని తిరిగి పొందాను. కానీ పసివాడు నా తమ్ముడు ఎక్కడ ఉన్నాడో? ఏం అవస్థ పడుతున్నాడో? వాడు కనిపించేదాకా నా మనసుకి శాంతి లేదు. వాడు ఎక్కడ ఉన్నాడో నాకు తెలియదు. వాడు కనిపించేదాకా నేను పెళ్ళి చేసుకోలేను. వాడు ఎన్నాళ్ళికి కనిపిస్తాడో తెలియదు. అందుకని నా కోసం నువ్వు కాచుకుని కూర్చోకు. నువ్వు విలన్ని పెళ్ళి చేసుకో" అన్నాడు గంభీరంగా.

తిరస్కారంగా చూసింది హీరోయిన్. "హుఁ ఎంత తేలికగా చెప్పావు, హీరో? నా మనసు నీ కిచ్చేశాను. మరొకరిని నాకు భర్తగా అంగీకరించలేను. నా బాధ అర్థం చేసుకో. నీ మనసులో నాకు స్థానం ఉంది. నాకు నీ మీద, నీకు నా మీద చెప్పలేనంత ప్రేమ ఉంది. మీ తమ్ముడు కనిపించేదాకా మాత్రమే కాదు—జీవితాంతంవరకు నీ కోసం వేచి ఉంటాను" అంటుంది గంభీరంగా.

(ద. ర.స.: వత్తులు మర్చిపోలేదు. కావాలనే వదిలేశాను. నేను వత్తులు పెట్టినా హీరోయిన్ పలకదు. పలకలేదు)

హీరో అమాంతం కావిలించేసుకున్నాడు హీరోయిన్ని. మరో సుదీర్ఘమైన కౌగిలింత.

నెక్స్ట్ సీన్. హీరో తమ్ముడి కోసం రోడ్లమీద, సినిమా హాళ్ళలోను, కిళ్ళీ బడ్డీల దగ్గర వెతుకుతూ ఉంటాడు. దిగులు పడుతూ గడ్డం పెంచి, సిగరెట్లు తాగుతూ ఉంటాడు.

తరవాత సీన్. హీరోయిన్ ఇల్లు. హీ. తండ్రి కూతురిమీద కారాలూ మిరియాలు నూరుతూ ఉంటాడు. "ఇంకా ఎన్నాళ్ళు అతని కోసం వేచి ఉంటావు. చక్కగా విలన్ని పెళ్ళి చేసుకో. నాకా గుండె జబ్బు. నీ పెళ్ళి చూసి కన్ను మూస్తాను. నా మాట విను" అంటాడు. ససేమిరా ఒప్పుకోదు హీరోయిన్. సరే నీ మొండితనం ఎంతకాలమో నేనూ చూస్తాను" అంటూ వెళ్ళిపోయాడు హీ. తండ్రి.

హీరోయిన్ దిగులుగా మెడలోని గొలుసు సవరించుకుంటూ తల వంచుకుని నడుస్తూ పేడ కంపెనీలో పశువుల యార్డుకి వెళ్ళింది. అంతలో ఒక ఎద్దు వెనకనుండి విలన్ వచ్చాడు. "హీరోయిన్ నన్ను పెళ్ళి చేసుకుంటావా, లేదా?" అని హుంకరించాడు.

"ఛీ ఛీ దుర్మార్గుడా! నీచుడా పోఅవతలకి. ఆడదాని మనసు నీకేం తెలుసురా?" అంది హీరోయిన్ గర్జిస్తూ.

వికటాట్టహాసం చేశాడు విలన్. "ఆడదాన్ని గురించి నాకు తెలియదా? నీ మొహం, నేను ఇంత వరకు డెబ్భై ఎనిమిది రేపులు చేశాను. డెబ్భై తొమ్మిదోసారి నిన్ను రేపు చేయ బోతుంటే ఆ హీరో వచ్చి విడిపించాడు. (మళ్ళీ వికట్టాటహాసం.) అందుకే నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

హీరోయిన్ ఆశ్చర్యపోయింది.

(ద. ర.స. :—అసలు న్యాయంగా హీరోయిన్ ఆశ్చర్యపోయినప్పుడు నోరు తెరవాలి. కానీ పేడ కంపెనీ కాబట్టి దోమల బాధ. అందుకని కళ్ళు పెద్దవిచేసి చూస్తే చాలు) సరే హీరోయిన్ ఆశ్చర్యం నుండి తేరుకుంది. "ఓరీ దుర్మార్గుడా, నీచుడా నువ్వా—నువ్వానన్ను ఆ నాడు రేపు చెయ్యబోయింది హు. నా ప్రియుడు నీకు తగిన సన్మానం చేశాడు. అయినా నీలో మార్పు రాలేదా" అంది కోపంగా.

మళ్ళీ మేఘంగర్జించినట్టు నవ్వాడు. "చూస్తావుగా—బలవంతాన అయినాసరే నిన్ను నా దాన్ని చేసుకోకపోతే నా పేరు విలనే కాదు" అని శపథం చేసి వెళ్ళిపోయాడు విలన్.

హీరోయిన్ పక్కనే ఉన్న ఎద్దుని కావలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. యజమానురాలికి వచ్చిన కష్టానికి ఆ ఎద్దు కన్నీళ్ళు కార్చింది. మిగతా పశువులన్నీ కూడా కన్నీళ్ళు కార్చాయి.

తరవాత సీన్. హీరోయిన్ హీరో దగ్గరకు వెళ్ళింది. డ్రైక్లీన్ సెంటర్లో రివాల్వింగ్ ఛెయిర్‌లో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు హీరో. దగ్గరకు వెళ్ళి అతని ఒడిలో తల దాచుకుని ఏడిచింది హీరోయిన్. ఉలిక్కిపడి చూసి వెంటనే హీరోయిన్ని లేవదీసి గుండెకి హత్తుకున్నాడు హీరో. "హీరోయిన్, నా హీరోయిన్. ఏమిటి? ఎందుకు? ఏం జరిగింది? ఎందుకు కన్నీరు కారుస్తున్నావ్? ఎందుకు బాధ పడుతున్నావ్?" అంటూ తల చెంపలు నిమిరాడు. ఏడుస్తూనే కారణం చెప్పింది హీరోయిన్. మండిపడ్డాడు హీరో. "ఏమిటీ? వాడా ఆ దుర్మార్గుడు? వాడి అంతు తేలుస్తాను. నా రాణి నువ్వు

ఏం భయపడకు'' అంటూ ఓదార్చి శపథం చేశాడు హీరో.

తరవాత సీన్. విలన్ అండర్ గ్రౌండ్ మహల్‌లో స్టైయిల్‌గానుంచుని చేతులో ఉన్న డ్రింక్ తాగుతూ—''డాడీ. నేను ఆ హీరోయిన్‌ని ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలి'' అంటాడు. విలన్ తండ్రి ''—అలాగే మై సన్. నువ్వు హీరోయిన్ని తీసుకురా. నేను మనం స్మగ్లింగ్‌లో సంపాదించిన డబ్బు అంతా వజ్రాల్లోకి మార్చేస్తాను. ఈ డర్టీ కంట్రీ వదిలేసి వెళ్ళిపోదాం'' అంటాడు.

ఆపక్కనే ఉన్న విలన్ పెద్ద కొడుకు—''ఎగ్జాక్ట్లీ, డాడీ అలాగే చేద్దాం'' అంటాడు. అందరూ చీర్స్ అనుకుని డ్రింక్స్ తాగుతారు. ఓపిక ఉంటే ఇక్కడ ఒక కాబరే డాన్సు పెట్టవచ్చు. పాట :—రాత్రికి వస్తానూ, రేపు రాత్రికి వస్తాను.


తరవాత సీన్. హీరో నీటుగా తయారయి, అమ్మా నేను హీరోయిన్ దగ్గరికి వెళ్తున్నా అంటాడు తల్లితో. ''మంచిది, తండ్రీ ఇదుగో ఈ స్వీటు తిని వెళ్ళు'' అంటూ నోటికి అందించింది. తినేసి కిందకి వచ్చాడు. సై.హీ. సై. హీరో కింది హాల్లో ఉన్నారు. చెల్లాయ్, బావా అని పలకరించి, నేను హీరోయిన్ దగ్గరికి పోతున్నాను అన్నాడు మంచిది అన్నయ్యా అంది సరదాగా సై. హీ. సై. హీరో. చిరునవ్వులు నవ్వాడు. హీరో కూడా నవ్వి బయటికి నడిచాడు.

హీరోయిన్ ఇంటికి చేరాడు. హీరోయిన్ హీరోయిన్ అంటూ వెతికాడు. ఎక్కడా హీరోయిన్ కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళిందబ్బా అంటూ తిరిగి తన ఇంటికి వచ్చేశాడు. ఇల్లంతా చీకటిగా ఉంది. అతని మనసు కీడు శంకించింది. ''అమ్మా, చెల్లాయ్, బావా'' అంటూ అరుస్తూ ఇల్లంతా గాలించాడు. ఎవరూ లేరు. ఇల్లంతా వెతికి తన బెడ్‌రూంలోకి వచ్చాడు. బల్లమీద రెప రెప లాడుతోంది కాయితం. తీసి చదివాడు—''ఒరే హీరో నాతోనే విరోధం పెంచుకుంటావా? నిన్ను నల్లిని నలిపినట్టు నలిపేస్తాను. నీ ప్రేయసిని నేను పెళ్ళి చేసుకునేందుకు తీసుకు వెళ్ళాను. నీతల్లిని, చెల్లిని, బావని చంపటానికి తీసుకు వెళ్ళాను. చేతనైతే, మొనగాడివైతే విడిపించుకో. విలన్—''అని ఉంది. పళ్ళు పటపటా కొరికాడు హీరో. ఆవేశంగా బయటికి నడిచాడు.

(ద. ర.స.:—ఇప్పటిదాకా నడిచిన కథలో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోండి. కానీ ఇక నుండి మాత్రం నేను రాసిన కథ యథాతథంగా తీసెయ్యండి.)

(ని. ర.స.:—ఇక నుండిబాగా ఖర్చు అవుతుంది. డబ్బు నీళ్ళలాగా ప్రవహించాలి. కానీ భయపడకండి. దీనికి రెట్టింపు తిరిగి వస్తుంది.''

సరే హీరో బయటికి రాగానే అతని స్నేహితులు కనిపించారు. వాళ్ళని కూడా వెంట తీసుకుని బయలు దేరాడు. వెతికి వెతికి చివరికి ఆ విలన్ అండర్ గ్రౌండ్ పాలెస్‌కి చేరుకున్నారు. మెల్లిగా లోపలికి అడుగు పెట్టారు. ఒక హాలు. దానికి ఒక పెద్ద వేడినీళ్ళ కొలను. నీళ్ళు మరిగి పోతున్నాయి. దానిలోంచి వెళ్ళటం అసాధ్యం. కానీ వెళ్ళితీరాలి తప్పదు. ఆ చివర వాకిలి ఉంది. ఆలోచించాడు హీరో. వెంటనే అందరి




బెల్టులా విప్పారు. ఒకదానికి ఒకటి తగిలించి విసిరాడు హీరో. నాలుగు సార్లు విఫలమై అయిదోసారి ఫలించింది అతని ప్రయత్నం. హుషారుగా నవ్వి ఆ బెల్టు ఆధారంగా పది మందీ ఒకేసారి ఆ చివరికి చేరుకున్నారు. ఒకరి నొకరు కావిలించుకున్నారు.

మరో హాల్లో అడుగు పెట్టారు. ఈ హాలుకి పదునైన కత్తులు నుంచోబెట్టి ఉన్నాయి. పైన ముళ్ళ గుత్తులు వేలాడుతున్నాయి. అతి భీకరంగా ఉంది పరిస్థితి. మళ్ళీ ఆలోచించాడు హీరో. వెంటనే అందరి జేబు రుమాళ్ళు తీసి గుచ్చుకోకుండా చేతులకు కట్టుకుని ముళ్ళ గుత్తులు పట్టుకుని గాలిలో ఒక ముళ్ళ గుత్తి నుండి మరో ముళ్ళ గుత్తికి మారుతూ పదును కత్తులమీద పడకుండా అతి చాకచక్యంగా ఆ చివరికి చేరారు. మళ్ళీ ఒకరి నొకరు కావిలించుకున్నారు.

మరో హాల్లో అడుగు పెట్టారు. ఇక్కడ ఇరవై మంది రాక్షసుల్లా వస్తాదులు నిలబడి ఉన్నారు. వాళ్ళందరికీ కుడి చేతుల్లో రెండేసి కత్తులూ, ఎడమ చేతుల్లో రెండు గొడ్డళ్ళు, అందరి తలల మీద ముళ్ళ కిరీటాలు ఉన్నాయి. వాళ్ళందరూ ఒక్కసారే వీళ్ళందరి మీదికీ దూకారు. ఆయుధాలతో వస్తాదులు, వట్టి చేతులతో హీరో బృందం ఘోరంగా యుద్ధం చేశారు. చివరికి విజయం హీరో బృందానికే లభించింది. వస్తాదులందరూ వీళ్ళ చేతి దెబ్బలకు తాళలేక నెత్తురు కారుతూ ఆయుధాలు కింద పారేసి పడుకున్నారు.

(ని. ర. స:—మనకు రక్తం సన్నివేశాలు కూడా చాలా ఉన్నాయి. కాబట్టి గ్లిజరిన్ లాగానే పెద్ద డ్రమ్ము ఎర్ర రంగు కొనేసుకుంటే సరిపోతుంది.)

(ద.ర.స.:—ఈ సీన్ నుండి హీరో ఫైటింగ్‌లు మొదలు. చాలా మంది ఎక్స్‌ట్రాలు డూపులతో వ్యవహారం నడపవలసిన అవసరం ఉంది. ఈ సీన్స్‌కు చాలా జాగరూకత అవసరం. ఎక్స్‌ట్రాలు హీరో చెయ్యెత్తగానే పడిపోకుండా, కాస్త దెబ్బ తగిలేవరకు ఆగి, పడిపోయేలాగా జాగర్త పడాలి. ఏ వస్తాదైనా కాస్త తిక్కలమారివాడు ఉండి పొరపాటున హీరోని ఎడం చేత్తో ఒకటి కొట్టాడంటే హీరో పళ్ళు రాలిపోయి, దవడ వాచిపోయి కన్ను కమిలి పోయిందంటే తరవాత నానా అవస్త. కాబట్టి చాలా జాగ్రత్తగా ప్రతి సీనూ అతి జాగర్తగా తీస్తూ అమిత శ్రద్ధ వహించాలి.)

సరే హీరో బృందం అందరు వస్తాదులను ఛంపేసి మరో హాలులోకి అడుగు పెట్టారు. మెల్లిగా అతి మెల్లిగా నాలుగు అడుగులు వేశారు. అంతే—పెద్ద వల వచ్చి వాళ్ళ మీద పడింది. అందరూ అందులో చిక్కుపడిపోయారు. వెనక నుండి విలన్ వికటాట్టహాసం చేస్తూ, ''అందరినీ బంధించండి'' అన్నాడు.

తరవాత సీన్. ఈ చిత్రం మొత్తంలోకి ఖరీదైన సెట్టింగ్. పెద్ద హాలు. జైలు గదుల లాగా వరుసగా గదులు. మొదటి గదికి హీరో తల్లి బంధింపబడి ఉంది. ఆ గది ఎదురుగా రెండు సింహాలు ఉన్నాయి. తరవాత గదిలో సై. హీ. ఆ గది కటకటాలకి కొండ చిలువలు చుట్టుకుని ఉన్నాయి. తరవాత గది అందులో సై. హీరో. ఆ గది ఎదురుగా రెండు చిరుత పులులు గర్జిస్తూ ఉన్నాయి. స్నేహితులు అందరినీ స్తంభాలకు కట్టేశారు వరసన. హీరోని ఒక ఎత్తైన వేదిక మీద స్తంభానికి కట్టి చేతులు వెనక్కి విరిచి కట్టారు. అతని చుట్టూ పెద్ద కొలిమి భగ. భగ మండుతోంది. వీళ్ళందరికీ మధ్య ఒక కుర్చీలో కూలబడి ఏడుస్తోంది హీరోయిన్.

విలన్ వికటంగా నవ్వాడు. ''చూడు, హీరో! ఏదో గొప్పవాడి వనుకున్నావా? అయిందా నీ పని? ఇటు చూడు—అదుగో ఆ డ్రమ్ము. దాని నిండా పెట్రోల్ ఉంది. దాని క్రింద రూపాయి కాసంత కన్నం చేసి కిలో మైనం అంటించేశాను. దాని కింద చిన్న ప్రమిదలో దీపం వెలిగించి పెట్టాను. ఆ దీపం వేడికి మైనం కరిగిపోయి పెట్రోల్ అంటుకుంటుంది. అప్పుడు ఆ డ్రమ్ము పేలిపోయి మీరంతా చస్తారు. ఇదుగో ఇటు చూడు. అది టైం బాంబు. దాని చుట్టూ నాలుగు వేటకుక్కలు కాపలా ఉన్నాయి. ఆ టైం బాంబు ఇరవై నిమిషాలలో పేలుతుంది. సరిగా ఆ టైముకే నేను, మా డాడీ, మా అన్నయ్య మా ప్రత్యేక విమానంలో వజ్రాలు తీసుకుని వెళ్ళిపోతాము'' అని, హృదయ విదారకంగా ఏడుస్తున్న హీరోయిన్ని బర బర లాక్కుంటూ వెళ్ళిపోయాడు విలన్.

భయంకరమైన నిశ్శబ్దం. టైం బాంబు టిక్ టిక్ అని శబ్దం చేస్తోంది. ప్రమిదలో దీపం వెలుగుతోంది. మైనం కరిగి చుక్కలు చుక్కలుగా క్రింద పడుతుంది. భయంకరమైన సన్నివేశం. అతి రోమాంచితమైన పరిస్థితి. అందరూ నిస్సహాయ స్థితిలో ఉన్నారు. హీరో రంకెలు వేస్తున్నాడు.

**(ఇంకావుంది)**

# స్క్రిప్టు సిద్ధంగా ఉంది సినిమా తియ్యండి — జయంతి

(క్రిందటి సంచిక తరువాయి)

3

**చేతులు** విడిపించు కునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కసిగా నేలని తన్నాడు. నేలమీద సగం విరిగిపోయిన బ్లేడు ముక్క కనిపించింది. హీరో కళ్ళు మెరిశాయి.

టైంబాంబు టిక్‌టిక్ మంటూ మోగుతూనే ఉంది. ఇంకా పందొమ్మిది నిమిషాలు మాత్రమే ఉంది.

హీరో మెల్లిగా వంగాడు. నోటితో బ్లేడు అందుకున్నాడు. మెడ వెనక్కి వంచి తన చేతులకు ఉన్న కట్లు కొయ్యటం మొదలు పెట్టాడు.

భయంకరమైన సస్పెన్స్. అందరూ వూపిరి బిగబట్టి హీరోని చూస్తున్నారు.

తాడు ఒక్కొక్క పొర తెగుతూంది. హీరో పెదవుల నుండి రక్తం ప్రవహించుతూ ఉంది. టైంబాంబు మరి రెండు నిమిషాలు గడిచిపోయినట్లు చూపిస్తూంది. హీరో ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఒక్కొక్క పొర తెగి పోతూంది.

ఎలాగైతేనేం తాళ్ళు తెగిపోయాయి. హీరో బంధ విముక్తుడు అయ్యాడు. ఇంకా పదిహేను నిమిషాల మాత్రమే గడువు ఉంది.

ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని దాదాపు వంద గజాల వెడల్పు ఉన్న మంటలు కొలిమి వంక చూశాడు.

అందరూ వూపిరి బిగబట్టి హీరోవంక చూస్తున్నారు. జై ఆంజనేయ అంటూ ఎగిరి దూకాడు. అందరూ కెవ్వున అరిచారు కానీ, ఏమీ ప్రమాదం జరగలేదు. కొలిమి ఇవతలికి దూకేశాడు హీరో. లేచి నుంచుని తల్లి జైలు గది వైపు నడిచాడు. ఇంకా పద్నాలుగు నిమిషాల గడువు.

తల్లి గది ముందు ఉన్న సింహాలు రెండూ ఎగిరి హీరో మీదకు దూకాయి. హోరాహోరీ పోరాటం మొదలయింది. రెండు సింహాలు, ఒక మనిషి. కిందామీదాదొర్లుతూ పోట్లాట సాగింది. అయిదునిమిషాల తరవాత రెండు సింహాలూ చచ్చిపోయాయి. హీరోకి ఏమీ దెబ్బలు తగల లేదు. కుడివైపున ఉన్న షర్టు కొంచెం మాత్రం చిరిగింది. ఇంకా తొమ్మిది నిమిషాలు మాత్రమే ఉంది గడువు. జైలు తలుపు తెరిచాడు. హీరో తల్లి బయటకు వచ్చేసింది. కొడుకుని కావిలించుకుంది.

తల్లిని విడిపించుకుని మెల్లిగా, అతి మెల్లిగా చెల్లెలి గది తలుపు తెరవబోయాడు. కానీ ఆ శబ్దానికి ఆ నాలుగు కొండ చిలువలూ అతన్ని చుట్టేసుకున్నాయి. మళ్ళీ భయంకరమైన పోరాటం. నాలుగు నిమిషాలలోను నాలుగు కొండ చిలువలనూ చంపేశాడు. ఇక మిగిలినవి రెండు చిరత పులులూ, అయిదు నిమిషాల టైము.

వెంటనే అటు నడిచాడు. యథాప్రకారం పులులు అతని మీదకి ఎగిరి దూకాయి. మళ్ళీ ఫైటింగ్ మొదలు. భయంకర పోరాటం.

తల్లి సై.హి. గది తలుపు తెరిచింది. సై.హి వెంటనే హీరో స్నేహితుల కట్లు విప్పేసింది.

హీరో ఘోరాతిఘోరంగా పోట్లాడి పులులను చంపేశాడు. అతని కుడి భుజం మీద షర్టు చిరిగిపోయింది. రక్తం కారుతూంది. మొహం అంతా గీతలు పడ్డాయి.

ఇంకా ఒక నిమిషం టైముఉంది. కానీ ఫైటింక్ చెయ్యటానికి ఎవరూ లేరు కాబట్టి పదండి పదండి అంటూ అందరినీ తీసుకుని బయటికి నడిచాడు హీరో

వీళ్ళు బయట అడుగు పెట్టిన మరు క్షణం పెద్ద చప్పుడుతో ప్రేలుడు సంభవించింది. వెనక్కి తిరిగి చూశాడు హీరో. "ఆహా ఎంత కాస్తలో ప్రమాదం తప్పిపోయింది" అన్నాడు తన్మయుంగా.

ద. ర. స:— కావాలి అనుకుంటే హి. తండ్రిని రెక్కలు విరిచి కట్టి పెట్రోలు డ్రమ్ము మీద కూర్చో బెట్టచ్చు. మరింత రోమాంచితంగా ఉంటుంది.

సరే అందరూ బయటకు వచ్చేశారు. హీరో సై. హీరోని చూసి "బావా నువ్వు వీళ్ళను తీసుకు ఇంటికి వెళ్ళు. నేను హీరోయిన్ కోసం వెళతాను" అన్నాడు.

"అబ్బే వీళ్ళతో వెళ్ళను. నేనూ, నీ స్నేహితులు కూడా వచ్చేస్తాం నీతో" అన్నాడు సై. హీరో.

"వద్దు. నేను ఒక్కడినే వెళతాను." "వీల్లేదు



మేముకూడా వస్తాము.'' ''రావద్దు.'' ''వస్తాం.'' ''రావద్దు.'' ''వస్తాం.'' ''మాట విను.'' ''చెప్తే వినాలి.'' 'వినను.'' ''రావద్దు'' ''వస్తాం.'' ''నీకు బుద్ధి లేదు'' అంటూ విసురుగా వెళ్ళి వాన్‌లో కూర్చుని స్పీడుగా పోనిచ్చాడు. సై. హీరో, స్నేహితులుఅందరూ వాన్‌నుపట్టుకునివేళ్ళాడసాగారు. హీరో పంతంగా స్పీడు పెంచుతున్నాడు.డెబ్బై,ఎనభై, తొంభై కిలోమీటర్ల స్పీడులో పోతూంది వాను. అందరూ అంతకన్నా పంతంగావానుపట్టుకుని వేళ్ళాడుతున్నారు. వాళ్ళ కాళ్ళు రోడ్డుకి రాసుకుంటున్నాయి. అయినా వదలటం లేదు. హీరో వాను ఆపేశాడు. ''మీరే గెలిచార్రా. మీలాంటి ఆప్తులు ఉండటం నా అదృష్టం'' అంటూ వాను ఎక్కించుకున్నాడు అందరినీ.

తరవాత సీన్. పెద్ద మైదానం. దాని మధ్య ఒక చిన్న విమానం. విలన్ హీరోయిన్ చెయ్యి పట్టుకుని ఉన్నాడు. హీరోయిన్ పెనుగులాడుతోంది. విలన్ డాడీ—అదే పెద్ద విలన్—పెద్ద బస్తా నిండా వజ్రాలు మూట కట్టుకుని భుజాన వేసుకుని కొడుకుతో మాట్లాడుతున్నాడు. చుట్టూరా పాతికమంది తుపాకీలతో ఉన్న గార్డులు అతి జాగర్తగా కాపలా కాస్తున్నారు.


హీరో వాన్ కాస్త దూరంలో ఆగింది. మెల్లిగా దిగారు అందరూ. అప్పటివరకూ వీళ్ళు వస్తున్న వైపే చూస్తున్న గార్డులు గిరుక్కున వెనక్కి తిరిగిపోయి మరోవైపు చూడసాగారు.

విలన్—''డాడీ! ఈ వజ్రాలు నూటతొంభై కోట్ల విలువ చేస్తాయి. మనం విదేశాలకు వెళ్ళి వీటితో హాయిగా'' ఉందాం అని చెప్తూ ఉండగానే ఎగిరి దూకాడు హీరో.

మరుక్షణం భయంకరమైన పోరాటం ప్రారంభం అయింది. గార్డులు మిషన్ గన్లతో. నిర్విరామంగా కాల్పులు జరుపుతున్నారు. దురదృష్టవశాత్తూ అవి ఎవరికీ తగలటం లేదు. హీరో కొట్టేటప్పుడుమాత్రం ఇద్దరూ ముగ్గురూ చచ్చిపోతున్నారు. విలన్ అన్నయ్యకి, సై. హీరోకి సంకుల సమరం. విలన్‌కి, హీరోకి ద్వంద్వయుద్ధం. విలన్ డాడీకి, కమేడియన్‌కి నవ్వు పుట్టించే పోరాటం సాగిపోతున్నాయి. హీరోయిన్ భయంతో గుండె మీద చెయ్యివేసుకుని చూస్తోంది.

ఒక పక్కనుండి పెద్ద శబ్దం. అందరూ అటు చూశారు. పది లారీలు. ఒక్కో లారీలోను రెండు వందలకు తక్కువలేకుండా బలవంతులైన మనుషులు. వాళ్ళ చేతుల్లో కత్తులూ, గొలుసులూ, తుపాకులు, గొడ్డళ్ళు, ఈటెలు బాణాలు మొదలగు ఆయుధాలు ఉన్నాయి. హీరోయిన్ గతుక్కుమంది. ఇప్పటిదాకా రెండువందలమందితో పదిమంది దిగ్విజయంగా పోరాడుతున్నారు. కానీ ఇప్పుడు ఆ సంఖ్య రెండు వేలకు పెరిగింది. పరిస్థితి విషమించింది.

హీరోయిన్‌కి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే ఎవరికంటా పడకుండా పరిగెడుతూ మధ్య మధ్య వెనక్కి తిరిగి చూస్తూ అమితవేగంగా పరిగెట్టి పరిగెట్టి తన పేడకంపెనీకి చేరింది.




ఎదురుగా ఉన్న ఎద్దుముందు మోకాళ్ళని కూర్చుంది. ''చూడు, ఎద్దూ! మీరు నాకు చేసిన సాయం అంతా ఇంతా కాదు. నేను ఈనాడు ఇన్ని లక్షలు సంపాదించానంటే నువ్వూ, నీ స్నేహితులు వేసిన పేడ కారణంగానే. ఈనాడు నాకు వచ్చిన కష్టంనుండి నన్ను కాపాడేందుకు మీరు తప్ప ఇంకెవ్వరూ లేరు. నా కాబోయే భర్త ఆపదలో ఉన్నాడు. నా మనసు బాధ పడుతోంది. నేను అతన్ని ఎంతగా ప్రేమించానో మీకన్నా ఎక్కువగా ఇంకెవరికీ తెలియదు. అసలు నేను ఇల్లు వదిలి వచ్చింది ఎవరికోసం? అతనికోసం. మిమ్మల్ని పెట్టుకుని వ్యాపారం మొదలుపెట్టింది ఎవరికోసం ? అతనికోసం. అలాటి అతను ఆపదలో ఉన్నాడు. అతనికి ఏదైనా అపాయం జరిగితే నా బ్రతుకు వ్యర్థం. నా జీవితం వృధా. నన్ను అర్థం చేసుకో, ఎద్దూ! నా మాంగల్యం కాపాడు. నా కాబోయే భర్తని రక్షించు'' అంది దీనాతి దీనంగా. దూరం నుండి ఇదంతా గమనిస్తున్న సై. హి. కూడా వచ్చి—''అవును, ఎద్దూ! మనిషికన్నా పశువే నయం. నా భర్త కూడా ఆపదలో ఉన్నాడు. నా పసుపు కుంకుమలు రక్షించండి'' అంది ఏడుస్తూ.

వెంటనే ఆ ఎద్దు రోషంగా తల ఎత్తింది. పౌరుషంగా రంకె వేసింది. వెంటనే మిగతా ఎద్దులూ, బర్రెలూ, ఆవులూ, దున్నపోతులూ అన్నీ రంకె వేశాయి. వెంటనే కట్లు తెంచుకుని విపరీతమైన వేగంతో పరుగుపెట్టాయి. ముందు హీరోయిన్, ఆ వెనక పశువుల మంద శరవేగంతో పరుగెడుతున్నాయి.

సై. హి. పనివారికి పరిస్థితి వివరించింది. వాళ్ళు తమ యజమానురాలికి కాబోయే భర్తకోసం వెంటనే సాయం వెళ్ళటానికి నిశ్చయం చేసుకున్నారు. వెంటనే రెండు లారీలనిండా పేడ తీసుకొని హుటా హుటి బయలు దేరారు.

అందరూ మైదానం చేరారు. మనుషులకీ, పశువులకీ పోరాటం. ఆయుధాలు అటువైపు నుండి దూసుకు వస్తూ ఉంటె ఇటువైపు నుండి పేడ ముద్దలు దూసుకు వెళుతున్నానాయి.

భయంకరమైన కురుక్షేత్ర సంగ్రామం జరుగుతూంది.

విలన్, విలన్ అన్నయ్య, విలన్ డాడీ పరిస్థితి విషమించిందని తెలుసుకుని మెల్లిగా వజ్రాల గోతాం నెత్తికి ఎత్తుకుని చల్లగా జారుకున్నారు. ఎవరితోనో పోరాడుతున్న హీరో ఇది గమనించి పశువులను తప్పుకుంటూ వాళ్ళ వెనకే పరిగెట్టాడు. సై. హీరో కూడా హీరోని గమనించి అతని వెనక వచ్చాడు.

విలన్, విలన్ అన్నయ్య, విలన్ డాడీ వెనకవస్తున్న హీరో సై. హీరోను గమనించి మరింత స్పీడుగా పరిగెట్టి తమ విదేశీ కారువంక నడిచారు. విలన్ అన్నయ్య డ్రైవింగ్ సీట్లో ఎక్కాడు. వెంటనే స్టార్టు చేశాడు. విలన్ బస్తా వెనకసీట్లోకి విసిరేసి తనూ ఆదరాబాదరా ఎక్కాడు. ఆఖరుగా విలన్ డాడీ కదులుతున్న కారులోకి ఎగిరి దూకి ఎడమకాలు కాస్త ఆలస్యంగా లోపలికి తీసుకున్నాడు. కారు వెళ్ళిపోయింది.

హీరో స్థాణువులా నిలబడి ఉన్నాడు. అతని మనసులో అగ్ని పర్వతాలు బద్దలు అవుతున్నాయి. తలలో సముద్రాలు పొంగిపోతున్నాయి. చెవుల్లో నదులు ప్రవహిస్తున్నాయి. కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నాయి. ఆ కాలు, అదే శాలు...అదే నీలంపాంటు ఇరవై ఏడేళ్ళ క్రిందట తను సిగరెట్ పెట్టి తీసుకు రాగానే కనిపించిన కాలు. ఆ నీలం పాంటు. వీడే—వీడే ఆ దుర్మార్గుడు.

మరుక్షణం వెర్రికేక వేశాడు హీరో. ''వాడే. దొరికాడు. ఇన్నాళ్టికి నా కళ్ళకు కనిపించాడు. వాడి ప్రాణం తీస్తాను. వాడి రక్తం తాగుతాను'' అంటూ పళ్ళు కొరుకుతూ వానువైపు నడిచాడు. సై. హీరో అనుసరించాడు.

ఇద్దరూ వాను ఎక్కారు. అమిత వేగంతో ముందుకు దూకించాడు హీరో. మధ్యలో ఒక మట్టి

రోడ్డు మీద తల్లి కనిపించింది. వాను ఆపాడు హీరో. "అమ్మా," అంటూ దిగాడు. "వచ్చావా, నాయనా! నువ్వు ఏమైపోయావో అని దిగులుగా బయలుదేరి వస్తున్నాను. అంది తల్లి. "అమ్మా! ఆ దుర్మార్గుడు కనిపించాడమ్మా" అన్నాడు హీరో. "ఎవరు, తండ్రీ?" అంది తల్లి. "వాడేనమ్మా! నాన్న గారిని చంపి తమ్ముడిని తీసుకుపోయిన దుర్మార్గుడు" అన్నాడు హీరో పళ్ళు కొరుకుతూ. తల్లి ఆవేశంతో వూగిపోయింది. "వెళ్ళు, నాయనా, వెళ్ళు. ఇదుగో ఈ కొబ్బరి చిప్ప తీసుకో. నీ క్షేమం కోసం దేవుడిని ప్రార్థించి కొట్టిన కొబ్బరిచిప్ప ఇది. ఇలాంటి కొబ్బరి చిప్ప వలననే నాకు కళ్ళు వచ్చాయి. ఈ కొబ్బరిచిప్ప తోనే వాడి తలపగలగొట్టు. వెళ్ళు,నాయనా, వెళ్ళు" అంది గంభీరంగా, కొబ్బరి చిప్ప అందిస్తూ. భక్తిగా అందుకొని కళ్ళకు అద్దుకుని తల్లికి నమస్కరించి వాను ఎక్కాడు హీరో. వేగంగా పోనిచ్చాడు. దూరంగా కనిపించింది విలన్ కారు. విలన్ కారు ఒక గోడవున్ ముందు ఆగింది. గబగబ దిగి లోపలికి వెళ్ళారు విలన్ బృందం.

తరవాత రెండునిముషాలకు హీరో వాను అక్కడికి చేరింది. విసురుగా లోపలికి ప్రవేశించాడు హీరో. "ఒరేయ్! నీ రక్తం తాగుతాను. నీ ప్రాణం తీస్తాను. నా తండ్రిని చంపిన రాక్షసుడా! నా తమ్ముడిని ఎత్తుకు పోయిన దుర్మార్గుడా? నా తల్లి కళ్ళల్లో ఏసిడు పోసిన కర్కోటకుడా! రా-రా బయటికి" అని గర్జించాడు. వెంటనే విలన్ డాడీ విలన్లు ఇద్దరికీ సైగచేశాడు. వాళ్ళిద్దరూ వీళ్ళిద్దరి మీదికి దూకాడు. పోరాటం ప్రారంభం. చివరికి గెలుపు విలన్లకే లభించింది. హీరోని, సై. హీరోని తాళ్ళతో కట్టేశారు—విలన్, విలన్ అన్నయ్య.

విలన్ డాడీ వికటాట్టహాసం చేశాడు. "వోరీ మూర్ఖుడా! నాతో విరోధం పెట్టుకుంటావా. నిన్ను చంపుతాను. నీ బావని చంపుతాను. అంతే కాదురా నీ తమ్ముడినీ నా కళ్ళ ఎదుటే చంపుతాను" అన్నాడు. అంత బాధలోనూ హీరోకి సంతోషం వేసింది. "ఏడి? ఏడి నా తమ్ముడు? ఏడి నా బంగారు తండ్రి? ఒక్కసారి చూపించు. నీకు పుణ్యం ఉంటుంది" అన్నాడు బ్రతిమాలుతూ దీనంగా.

మళ్ళీ నవ్వాడు విలన్ డాడీ. "ఇదుగో, ఇదుగో నీ తమ్ముడు", అంటూ విలన్‌ని చూపించాడు.

అందరూ ఆశ్చర్యపోయారు. కళ్ళు పెద్దవి చేశారు. నోళ్ళు తెరిచారు. విలన్ ముందు తేరుకున్నాడు. "ఏమిటీ ఈ—హీరో మా అన్నయ్యా?" అన్నాడు. హీరో తేరుకున్నాడు. "ఏమిటి ఈ విలన్ నా తమ్ముడా?" అన్నాడు పరవశంగా. అవును అన్నాడు విలన్ డాడీ.

విలన్, హీరో ఒకరి నొకరు పరవశంగా చూసుకున్నారు. "అన్నయ్యా, తమ్ముడూ, అన్నయ్యా తమ్ముడూ. అన్నయ్యా,తమ్ముడూ" అంటూ నోరారా పిలుచుకున్నారు. వీళ్ళిద్దరినీ చూసి సై. హీరో ఆనందం పట్టలేక కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు.

"అన్నయ్యా! నిన్ను నేను బంధించానా? నన్ను క్షమించు" అంటూ హీరో వైపు నడవబోయాడు విలన్. ఆగు అని గర్జించాడు విలన్ డాడీ. "డాడీ" అన్నాడు విలన్ ఆశ్చర్యంగా. "అవునురా! ఎవడు నీకు డాడీ? నీ తండ్రిని కుక్కని కాల్చినట్టు కాల్చి చంపాను. నీ అన్న ఎదుట నిన్ను, తరవాత నీఅన్నను, ఆ తరవాత నీబావని కాల్చి చంపుతాను. నీ తల్లిని, చెల్లిని కూడా కాల్చి చంపుతాను" అన్నాడు పిస్తోలు గురిపెడుతూ. విలన్ ఒక నిమిషం అటే చూసి ఎగిరి దూకాడు భయంకరమైన పోరాటం సాగింది. విలన్లు ఇద్దరితో యుద్ధంచేస్తూనే వచ్చి హీరో కట్లు విప్పేశాడు విలన్. హీరో సై. హీరో కట్లు విప్పి విలన్ డాడీ మీదికి దూకాడు. మళ్ళీ గంభీరమైన పోరాటం. విలన్ డాడీ, విలన్ అన్నయ్య చెరో గునపం తీసుకుని హీరోతో తలపడ్డారు. వాళ్ళతో పోట్లాడుతూ ఉండగానే ఇద్దరూ చెరో వైపున గునపాలతో నిలబడి పొడవబోతున్నారు.

ఇది చూసిన విలన్ కెవ్వున అరుస్తూ వచ్చి అన్నని పక్కకి నెట్టేశాడు. ఫలితం. విలన్ డాడి చేతిలోని గునపం విలన్ కడుపులో గుండా వీపులోకి వచ్చేసింది. విలన్ అన్నయ్య గునపం విలన్ వీపులోంచి దూసుకపోయింది. పెద్దగా అరిచి కూలిపోయాడు విలన్. హీరో కోపంతో పిచ్చివాడయాడు.





"ఒరేయ్! నీకు నా చేతిలో మూడిందిరా" అంటూ కొబ్బరిచిప్ప తీసుకుని దానితో విలన్‌లను కొట్టడం ప్రారంభించాడు. ఇదంతా చూస్తున్న సై. హీరో హీరో దగ్గరు పరిగెట్టాడు. హీరో వారించాడు—"బావా! నువ్వు తమ్ముడి దగ్గరకు వెళ్ళు. వీళ్ళ పని నేను చూస్తాను" అన్నాడు.

"సరే" అని వెనక్కి తిరిగి విలన్ దగ్గరకు వెళ్ళాడు సై. హీరో. విలన్ రక్తం మడుగులో పడి ఉన్నాడు. "వెళ్ళు, బావా అన్నయ్యకి సాయం వెళ్ళు. వాళ్ళు చాలా దుర్మార్గులు." అన్నాడు సై. హీరోతో.

"అలాగే" అంటూ వెళ్ళి హీరో పక్కన నిలబడ్డాడు సై. హీరో. "ఒకసారి చెప్తే నీకు కాదూ? వెళ్ళు తమ్ముడి దగ్గరకు" అని కసిరాడు హీరో పోరాడుతూనే.

తల వూపి విలన్ దగ్గరకు వెళ్ళాడు సై. హీరో. "మళ్ళీ వచ్చావా? అన్నయ్యకు సాయం ఉండమన్నాగా?" అని విసుక్కున్నాడు విలన్.

ఇక విసుగువేసి ఎవరి దగ్గరకూ వెళ్ళకుండా ఒక మూల హాయిగా కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు సై. హీరో.

విలన్లను కొబ్బరి చిప్పతో కొట్టి కొట్టి కొన ప్రాణాలతో వదిలాడు హీరో. వాళ్ళిద్దరూ నేలమీద పడి ఉన్నారు. ఒళ్ళంతా రక్తం. కదలలేని స్థితిలో ఉన్నారు.

వాకిట్లో నాలుగు పోలీసు జీపులు ఆగాయి. రండి రండి అంటూ దిగింది హీరోయిన్. ఏభై మంది పోలీసులు దిగారు. అందరూ తుపాకులు గురిపెట్టి లోపలికి నడిచారు. ఇనస్పెక్టరు చకచక నడిచి కొన ప్రాణాలతో పడి ఉన్న వాళ్ళకు తుపాకి చూపించి "యువార్ అండర్ అరెస్ట్" అని చెప్పి బేడీలు వేశాడు.

హీరో ఒక్క పరుగున తమ్ముడి దగ్గరకు వచ్చాడు. తమ్ముడా అంటూ రక్తం మడుగులో పడి ఉన్న తమ్ముడిని రెండు గునపాలు దూరిపోయిన తన తమ్ముడిని కావిలించుకొని గుండె పగిలిపోయేలా రోదించాడు.

"అన్నయ్యా ఎందు కన్నయ్యా బాధ పడతావు? నాలాటి దుర్మార్గుడికి తగిన శాస్తి జరిగింది. కన్న తల్లిని, స్వంత చెల్లెలిని, నిన్ను అటువంటి బాధలకు గురి చేశాను. నా మరణంతో నీ పాపం పరిష్కారం అవుతుంది, అన్నయ్యా" అన్నాడు విలన్ నీరసంగా.

అయ్యో అంటూ ఆక్రోసించారు హీరో, హీరోయిన్, సై. హీరో. "అంతమాట అనకు తమ్ముడూ నిన్ను బతికించుకుంటానురా. నా ప్రాణం ఇచ్చి అయినా నిన్ను బతికించుకుంటానురా" అన్నాడు హీరో.

వెంటనే హీరో, సై. హీరో రెండు గునపాల సాయంతో విలన్‌ని కాల్చిన పందిని ఎత్తినట్లు ఎత్తి మోసుకుంటూ తీసుకువెళ్ళి వాన్‌లో ఎక్కించారు. రక్తంధార కారిపోతూంది. ఆ ధార వెంట హీరోయిన్ విలపిస్తూ వెళ్ళి వాన్‌లో ఎక్కింది. వాన్ కదిలింది.

హాస్పిటల్ ముందు ఆగింది. తల్లి పరుగెట్టుకు వచ్చింది. "నాయనా తమ్ముడు కనిపించాడా?" అంది ఆత్రంగా భోరున ఏడుస్తూ. తమ్ముడిని చూపించాడు హీరో. తల్లి నిలువునా నీరయిపోయింది. "నాయనా మురేషూ" అంటూ ఏడిచింది. విలన్‌కూడా ఏడిచాడు. తల్లిని కావిలించుకుని. సై. హి. వచ్చింది. అంతా అర్థం చేసుకుని"చిన్నన్నయ్యా" అంటూ ఏడిచింది. "చెల్లీ" అంటూ ఏడిచాడు విలన్. అప్పటి దాకా ఆ పక్కనే నిలబడి విచిత్రం చూస్తున్న డాక్టర్ నోరు విప్పాడు—"పేషెంటుని లోపలికి తీసుకు రండి" అంటూ ఆర్డర్ వేశాడు.

విలన్ ఒంట్లోని గునపాలతో సహా స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి లోపనికి తీసుకు వెళ్ళిపోయాడు డాక్టర్. అందరూ గొల్లున ఏడ్చారు.

పది నిముషాల తరవాత డాక్టర్ బయటికి వచ్చాడు. సీరియస్‌గా ఉన్నాడు. హీరో, సై. హీరో అతని దగ్గరకు వెళ్ళారు ఆదుర్దాగా. "ఎలా ఉంది డాక్టర్ మా తమ్ముడికి?" అన్నాడు హీరో.

దీర్ఘంగా నిట్టూర్చాడు. డాక్టర్ కళ్ళజోడు చేత్తో పట్టుకున్నాడు. "చూడండి అతనికి చాలా బలమైన గాయాలు తగిలాయి. రెండు గునపాలు పొడుచుకున్నాయి కదా—వెన్నెముక మధ్యకి విరిగి పోయింది. లివరు చిరిగి చీలికలు, పీలికలు అయిపోయింది. కిడ్నీలు రెండూ కన్నాలు పడిపోయాయి. కడుపు కూడా ఎందుకూ పనికి రాకుండా అయిపోయింది. గుండెకు రవ్వాపాయ కాసంత కన్నం పడటం వల్ల రక్తం విపరీతంగా పోయింది." అన్నాడు గంభీరంగా.

"డాక్టర్" అన్నాడు హీరో దీనంగా.

"కంగారు పడకండి ప్రాణాపాయం ఏమీ లేదు. రక్తం ఎక్కించాలి" అన్నాడు డాక్టర్.

"ఎక్కించండి, డాక్టర్, వెంటనే ఎక్కించండి" అన్నాడు హీరో.


అంతలోనే నర్సు పరుగున వచ్చింది. "డాక్టర్! బ్లడ్ బాంకులు అన్నింటిలోను గాలించారుట—ఇతని గ్రూపు రక్తంలేదుట" అంది గాభరాగా.

"హో మైగాడ్" అన్నాడు డాక్టర్ పైకి చూస్తూ.

"డాక్టర్! నా రక్తం తీసి వాడికి ఎక్కించండి. ఆలస్యం చెయ్యకండి" అన్నాడు హీరో.

"అలా ఎలాగండీ? మీ గ్రూపు ఆయనకి సరిపోతే అప్పుడుకదా?" అన్నాడు డాక్టర్.

"హు. ఎంత మాటన్నారు డాక్టర్. నా రక్తం నా తమ్ముడికి పనికిరాదా? అసలు ఆమాట అనటానికి మీకు నోరెలా వచ్చింది. మనసెలా ఒప్పింది? వాడికోసం నేనెంత అలమటించిపోయానో, ఎంత బాధపడ్డానో మీకు తెలియదు, డాక్టర్,




మీకు తెలియదు. ఇన్నాళ్ళకి వాడు కనిపిస్తే, వాడు అంత ప్రమాదంలో ఉంటే నా రక్తం పనికిరాదేమో అంటారా. అలా అనకండి, డాక్టర్! నా మనసు అర్థం చేసుకోండి. నా రక్తం అంతా తోడి వాడికి ఎక్కించండి. వాడిని బ్రతికించండి. ఆలస్యం చెయ్యకండి" అన్నాడు ఆవేశంగా.

"అంతే, డాక్టర్! ఇలాటి సమయాలలో కూడా రక్తపరీక్షలూ అవీ అంటూ కూర్చుంటే ఎలా? నేను అతనికి బావని—నా రక్తం కూడా తియ్యండి" అన్నాడు సై. హీరో ఆవేశంగా.

"అంతే, డాక్టర్! మేమంతా హీరో ప్రాణ స్నేహితులం. మా అందరిది ఒకే మాట, ఒకే బాట. హీరో తమ్ముడు మాకూ తమ్ముడే. మా అందరి రక్తం తియ్యండి—సంశయించకండి" అన్నారు హీరో స్నేహితులు.

డాక్టర్ చిరునవ్వు నవ్వాడు. "ఆహా ఏమి గొప్ప

స్నేహం. ఇటువంటి స్నేహితులను నేను ఎక్కడా చూడలేదు. రండి మా రక్తం తీస్తాను'' అంటూ లోపలికి నడిచాడు.

తరవాత సీన్. బల్లమీద పడుకొని ఉన్నాడు విలన్. చుట్టూరా కొంతమంది మంచాలమీదా, మరి కొంతమంది నేలమీద పడుకున్నారు. అందరి చేతులనుండి ట్యూబులు—నేరుగా ప్రయాణించి విలన్‌కి కనెక్ట్ చేసిన సీసాకి తగిలించి ఉన్నాయి. రక్తం చుక్కలు చుక్కలుగా పడుతోంది. హీరో కంటి వెంట నీటి చుక్కలు కారుతున్నాయి. అతని తల దగ్గర నిలబడి అతని కళ్ళు వత్తుతూ తల నిమురుతోంది హీరోయిన్. సై. హి. ఆలయంలో దేవుడి పాదాలమీద పడి వేడుకుంటోంది. తల్లి ఒక పళ్ళెంనిండా కొబ్బరి ముక్కలు, కుంకం పెట్టుకుని విలన్ నుదుట పెట్టింది. ఒక కొబ్బరి నోట్లో వేసింది.

తరవాత అతని దగ్గర నిలబడి పరీక్ష చేస్తున్న డాక్టర్లందరికీ మొహాన కుంకుం బొట్లు పెట్టి, కొబ్బరి ముక్కలు నోటికి అందించింది. నర్సులకి కూడా అలాగే పెట్టి తరవాత పెద్దకొడుక్కీ, అల్లుడికి ఇంకా రక్తదానం చేస్తున్న వారందరికీ కూడా బొట్లుపెట్టి ప్రసాదం ఇచ్చింది. అందరు విచారంగా తిన్నారు. ఈ సీన్‌లో ఒక పాట. అశరీరవాణి—''రక్తం, రక్తమే నీలోనూ, నాలోనూ మనందరిలోనూ ప్రవహించేది ఆ రక్తమే''

రక్తం ఎక్కించడం అయిపోయింది. డాక్టర్లు విలన్‌ని పరీక్షించారు. పెదిమలు విరిచారు. ''ఇక మా చేతుల్లో ఏమీలేదు. ఆ భగవంతుడే రక్షించాలి'' అంటూ వెళ్ళిపోయారు. తల్లి వెంటనే మటం వేసుకుని కూర్చుని దైవ ప్రార్థన మొదలు పెట్టింది.

హీరో ఆవేశంగా దేవాలయం వైపు నడిచాడు. దేవుడివంక సీరియస్‌గా చూశాడు. ''చూడు. నీవు గొప్పవాడివి అంటారు. నేను ఇప్పుడు నిన్ను కోరుకోవటానికి వచ్చాను. ఇంతవరకూ నిన్ను ఏమీ అడగలేదు నేను. కాని, ఇప్పుడు అడుగుతున్నాను. మర్యాదగా నా తమ్ముడిని బ్రతికించు. నీ పరువు నిలబెట్టుకో'' అంటూ పోట్లాడాడు.

వెంటనే ఉరుములు ఉరిమాయి. మెరుపులు మెరిశాయి. నదులు పొంగాయి. భూమి బద్దలయింది. కుండపోతగా వర్షం కురిసింది. కాసేపటికీ అంతా ప్రశాంతంగా అయిపోయింది.

హాస్పిటల్‌లో డాక్టర్లు విలన్‌ని పరీక్ష చేశారు. ఆనందంతో కేకలు వేశారు. ''ఇతడు బతికాడు. ఇతనికి ఇంకే ప్రమాదమూ లేదు'' అన్నారు.

అందరూ ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. ఎవరిని ఎవరు కావిలించుకుటున్నారో తెలీకుండా కావిలించేసుకున్నారు. హాస్పిటల్ దద్దరిల్లిపోయేలాగా అరిచారు. అందరూ విలన్ని వెంట బెట్టుకుని బయటికి నడిచారు.

వాకిట్లోకి వచ్చేసరికి ఎదురుగా పోలీసులు. వాళ్ళ చేతుల్లో బేడీలు ''యువార్ అండర్ అరెస్ట్'' అన్నారు విలన్ని. హీరో ఆశ్చర్యపోయాడు.

''ఎందుకు, ఇనస్పెక్టర్? నా తమ్ముడు ఏం చేశాడు?'' అన్నాడు.

''మీ తమ్ముడు అయిన ఈ విలన్ డెబ్బై ఎనిమిది రేపులు చేశాడు. అరవై రెండు దోపిడీలు చేశాడు. అంతేకాక స్మగ్లింగ్‌లో కూడా ఇతని హస్తం ఉంది. ఇతని కోసం మేము చాలా కాలంగా గాలిస్తున్నాము. ఇప్పటికి దొరికాడు'' అన్నాడు ఇనస్పెక్టరు గంభీరంగా.

''ఎస్ ఇనస్పెక్టర్ నేను దోషిని నన్ను బంధించండి'' అంటూ చేతులు జాచాడు విలన్. వెంటనే సంకెళ్ళు వేసేశారు పోలీసులు.

అందరికీ చెప్పి చకచక నడుస్తూ వెళ్ళి జీప్ ఎక్కాడు. అందరూ ఏడుస్తూ చూస్తున్నారు.

హీరోకి కోపం, దుఃఖం, ఆవేశం ముంచుకు వచ్చాయి. ''చూస్తాను కావాలంటే ప్రపంచం అంతటికి పోరాడి అయినా నా తమ్ముడిని రక్షించుకుంటాను'' అంటూ శపథం చేశాడు.

తరవాత సీన్ కోర్టు. ముసలిజడ్జి. నడివయసు ప్రాసిక్యూటర్. బోనులో విలన్. పెరిగిన గడ్డం తల వంచుకుని నిలబడి ఉన్నాడు. ఒక పక్కగా విలన్ బంధుకోటి అంతా కూర్చున్నారు.

కేసు విచారణ ప్రారంభం అయింది. పి. పి. లేచాడు. ''యువర్ ఆనర్. ఈ ముద్దాయి నరరూప



Tom & Bay 60/82-T



రాక్షసుడు. డెబ్బై మందికి పైగా యువతులను మానభంగం చేశాడు. ఎన్నో దోపిడీలు చేశాడు. పై పెచ్చు మన సొంతం అయిన మన దేశ సంపదను దొంగరవాణా చేసి విదేశాలకు పంపి చాలా ధనం సంపాదించాడు. ఈ ద్రోహిని, ఈ దేశద్రోహిని, ఈ రాక్షసుడిని, ఈ దోపిడీదారుని అనేకమంది కన్నెల జీవితాలు నాశనం చేసిన ఈ నీచుడిని తగిన విధంగా శిక్షించండి. ఇక ఎవరూ ఇలాటి పనులు చెయ్యకుండా ఉండేలాగా శిక్షించండి. అటువంటి నేరాలు చేసేవాళ్ళు ఇతని శిక్ష చూసి భయపడి మళ్ళీ ఆ నేరాలు చెయ్యటానికి సాహసించకుండా ఉండేలాగా కఠినంగా శిక్షించండి'' అన్నాడు ఆవేశంగా.

కోర్టు అంతా కలకలం. జడ్జి విలన్ వైపు కోపంగా అసహ్యంగా చూశాడు. వెంటనే కాగితాలు తీసి ''పి. సి. వాదనల వల్ల ఈ ముద్దాయి పరమ దుర్మార్గుడని రాక్షసుడని క్షమించరాని దోషి అని ఋజువు అయింది. కాబట్టి ఇతనికి ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ మూడు వందల ఎనభై రెండు ప్రకారం కఠిన'' అంటూ చెప్తుతున్నాడు.

హీరో లేచాడు ''ఆగండి'' అని అరిచాడు. కోర్టు అంతా హీరో వైపు చూశారు.


''యువరానర్ ఇది చాలా అన్యాయం. నా తమ్ముడు నిర్దోషి. వాడిని నిర్దోషిగా నిరూపించే అవకాశం నాకు ఇవ్వండి'' అన్నాడు. హీరో పి. పి. లేచాడు. ''అబ్జక్షన్ యువరానర్. లా పాసయిన వారికి తప్ప మరెవరికీ కోర్టులో వాదించే అధికారం లేదు'' అన్నాడు.

హీరో హేళనగా చూశాడు పి. పి. వంక. ''యువర్ ఆనర్ నాకులా డిగ్రీ లేదు నిజమే. కానీ అన్యాయం జరుగుతున్నప్పుడు దానిని న్యాయంగా నిరూపించే అవకాశం ఈ స్వతంత్ర భారతదేశంలో ప్రతి ఒక్క వ్యక్తికీ ఉంది'' అన్నాడు హుందాగా.

జడ్జి సోడాబుడ్డి కళ్ళద్దాల లోంచి చూశాడు. ''ఎస్. కరెక్ట్. మీకు అవకాశం ఇస్తున్నాను'' అన్నాడు.

వెంటనే హీరో కోర్టు హాలులో మధ్యకి వచ్చేశాడు. గొంతు సవరించుకున్నాడు. ''యువరానర్! వీడు నా తమ్ముడు. చిన్న తనంలో మా అందరికీ దూరం అయి ఒక దుర్మార్గుడి పెంపకంలో పెరిగాడు. డెబ్బై ఎనిమిది మానభంగాలు చేశాడు. కానీ ఎందుకు చేశాడు? అసలు మొదటి మానభంగం తరవాతే వీడిని పట్టుకొని అలా చెయ్యకూడదు తప్పు అని పోలీసులు, కోర్టు వారు వాడికి నచ్చచెప్పి ఉంటే వాడు మిగిలిన డెబ్బై ఏడు మానభంగాలూ చేసే వాడు కాడు. కాబట్టి ఆ తప్పు పోలీసులది. న్యాయస్థానానిది. కాబట్టి శిక్ష పోలీసులకు, న్యాయస్థానానికి విధించాలి'' అన్నాడు. పోలీసు ఇనస్పెక్టరు చెమటలు కక్కుకుంటున్నాడు. జడ్జి గడగడ వణికిపోతున్నాడు.

హీరో మళ్ళీ మొదలు పెట్టాడు. ''దోపిడీల విషయం కూడా అంతే. వాడికి అది తప్పు అని చెప్తే చేసుకునే వాడేనా? వాడు నిర్దోషి, యువర్ ఆనర్! అసలు దోషులను వదిలేసి ఇలాటి అమాయకులను పట్టి తీసుకు వస్తున్నారు హృదయం లేని పోలీ



సులు. వాళ్ళను దోషులుగా ఆరోపించి వాదిస్తున్నారు కరుణలేని ప్రాసిక్యూటర్లు. వాళ్ళను దోషులుగా నిర్ణయించి శిక్ష విధిస్తున్నారు మనసులేని జడ్జీలు. కానీ అలా చేయకూడదు. తప్పుచేసిన వారిని పట్టుకున్నప్పుడు శిక్షించకూడదు ఇది తప్పు నాయనా అని నచ్చచెప్పి వదిలేయాలి. మళ్ళీ తప్పుచేస్తే మళ్ళీ నచ్చచెప్పాలి. మళ్ళీచేస్తే మళ్ళీ చెప్పాలి. అలా మనం చెప్పగా చెప్పగా వాళ్ళే తెలుసుకుని వాళ్ళే మారిపోతారు. అంతేగానీ తప్పుచేసినంతమాత్రాన శిక్షిస్తామా? గాంధిగారు ఏమన్నారు? ఒక చెంప కొడితే రెండో చెంప చూపించమన్నారు. గౌతమ బుద్ధుడు అహింస బోధించమన్నాడు. అటువంటి పవిత్ర కర్మభూమిలో పుట్టిన మనం తప్పుచేసిన వారిని హింసించటమా? అయ్యో ఆ పవిత్రమూర్తుల ఆత్మలు ఈ అన్యాయం చూసి ఎంత ఘోషిస్తున్నాయో కదా'' అంటూ కంట తడిపెట్టుకొని బల్లకు తలవేసి కొట్టుకున్నాడు హీరో.

చుట్టూ కూర్చున్న జనం అంతా కన్నీళ్ళు పెట్టుకున్నారు. పోలీసు ఇన్స్పెక్టరు పశ్చాత్తాపంతో తల వంచుకున్నాడు. పి. పి. పశ్చాత్తాపం భరించలేక పాప భీతితో గుండెలు బాదుకుంటూ కోర్టు హాలులో కింద పొర్లుతూ ఏడుస్తున్నాడు. జడ్జి తన ముందు ఉన్న బల్ల మీద తల వాల్చుకుని కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నాడు.

హీరో సర్దుకున్నాడు. కింపడి ఏడుస్తున్న పి. పి. ని లేపనెత్తాడు. ''ఏడవకండి, సార్! అయి పోయింది—ఏదో అయిపోయింది. ఇక ముందు ఇలా అన్యాయాలు జరగకుండా జాగర్త పడతాం. నూతన సమాజ స్థాపనకు మనం అందరం నడుంకట్టి పాటుపడదాం'' అన్నాడు గంభీరంగా. కరతాళధ్వానులతో కోర్టు దద్దరిల్లిపోయింది.

జడ్జి తల ఎత్తాడు. కళ్ళు తుడుచుకున్నాడు. కాగితాలు తీసి, ''ఈ ముద్దాయి తెలియక డెబ్బై ఎనిమిది మానభంగాలు, దోపిడీలు, స్మగ్లింగ్ చేశాడని ఋజువు అయింది. కాబట్టి ఇతనిని నిర్దోషిగా భావిస్తున్నాను. అంతేకాదు ఇతనికి అన్నీ తెలిసేలాగా చెప్పి ఇతన్ని సన్మార్గంలో నడిపే బాధ్యతను అతి సమర్థవంతుడు, తన వాదనతో మా కళ్ళు తెరిపించిన మహనీయుడు అయిన హీరోకి అప్పగిస్తున్నాను. హీరోకి మనందరి తరఫున నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను'' అన్నాడు. మళ్ళీ అందరూ చప్పట్లు కొట్టారు.

ఆఖరి సీన్. హీరోయిన్ సిగ్గుల మొగ్గలలాగా పెళ్ళిపీటల మీద కూర్చుంది. హీరో ఆవిడ మెడలో మంగళసూత్రం కట్టాడు.

హీరో, హీరోయిన్, విలన్, సై. హీ., సై. హీరో, తల్లి, హీ. తండ్రి, హీరో స్నేహితులు, జడ్జి, పి. పి., ఇన్స్పెక్టరు, రక్తం ఎక్కించిన డాక్టరు వరసగా నిలబడ్డారు. కమేడియన్ వచ్చి అందరినీ నవ్వించి కెమెరాతో ఫోటో తీశాడు. అందరూ హాయిగా నవ్వుకున్నారు.

(సమాప్తం)